
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 21.4
****
ANDHRAJYOTHY



నల్లగొండ
3
బుధవారం 5 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.40 (310.2522)	44,095	44,095
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	6,527.50	6,527.50
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



ఆస్పత్రుల్లో రోగులకు భోజనం సరఫరా చేసే కాంట్రాక్టుల కోసం ఏజెన్సీల నిర్వాహకులు పైరవీలు ముమ్మరం చేశారు. కాంట్రాక్టు దక్కించుకునేందుకు దొడ్డిదారి ప్రయత్నాలు ప్రారంభించారు. ఉన్నతాధికారులపై రాజకీయ ఒత్తిడి తెచ్చి కాంట్రాక్టులు దక్కించుకునేందుకు యత్నిస్తున్నారు. జిల్లాలోని ఐదు ఏరియా ఆస్పత్రులు, ఒక కమ్యూనిటీ ఆస్పత్రికి సంబంధించి రోగులు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరా చేసే కాంట్రాక్టుకు ఇటీవల అధికారులు టెండర్లు ఆహ్వానించారు. వాస్తవానికి ఈ టెండర్ల ఫైనాన్షియల్ బిడ్లను మంగళవారమే తెరవాల్సి ఉండగా,7వతేదీకి వాయిదా వేశారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

డైట్ కాంట్రాక్టుల కోసం

రాజకీయ పైరవీలు!

- జిల్లాలో నాలుగు ఏరియా, ఒక కమ్యూనిటీ ఆస్పత్రికి డైట్ సరఫరాకు టెండర్లు
- అర్హత సాధించిన 53 ఏజెన్సీలు
- 7న ఫైనాన్షియల్ బిడ్లు తెరిచి కాంట్రాక్టర్ల ఎంపిక
- అందరూ ఒకే ధర కోట్ చేస్తే డ్రా విధానం
- డ్రాకు వెళ్లకుండా నేరుగా కాంట్రాక్ట్ పొందేందుకు కొందరి యత్నాలు


రాజకీయ టెండర్ దక్కించుకునేందుకు నేతల పైరవీలు ఉధృతమవడంతో కాంట్రాక్టు ఖరారు ప్రక్రియ పారదర్శకంగా సాగడంపై టెండర్ బిడ్లు దాఖలు చేసిన ఏజెన్సీల నిర్వాహకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రోగులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఐదు ఏరియా ఆస్పత్రులు, ఒక కమ్యూనిటీ ఆస్పత్రి

జిల్లాలో వైద్యవిధాన పరిషత్ నిర్వహణలో ఉన్న మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, నకిరేకల్ ఏరియా ఆస్పత్రులతోపాటు, మర్రిగూడెంలోని సామాజిక వైద్యశాలలో రోగులకు, డ్యూటీ డాక్టర్లకు భోజనం అందించే కాంట్రాక్ట్ నిమిత్తం వైద్యవిధాన పరిషత్ టెండర్లను ఆహ్వానించింది. అందుకు ఆసక్తి, అర్హత ఉన్న ఏజెన్సీల నుంచి అక్టోబరు 29వరకు టెండర్లు తీసుకున్నారు. ఈ టెండర్లలో మంగళవారం టెక్నికల్ బిడ్లను పరిశీలించగా, 53 అర్హత ఉన్న వాటిని నిర్ధారించారు. వీటి ఫైనాన్షియల్ బిడ్లను తెరిచేందుకు అదనపు కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రక్రియను ఈనెల 7వ తేదీకి వాయిదా వేశారు. అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షణాధికారి కన్వీనర్‌గా ఉండే కమిటీ, కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తుంది. ఈ కమిటీలో వీరిద్దరితో పాటు డీఎంహెచ్‌వో, ముగ్గురు వైద్యులు, డైటీషియన్, ఇద్దరు సామాజికవేత్తలు సభ్యులుగా ఉంటారు. అయితే కాంట్రాక్టర్ల ఎంపికలో తుది నిర్ణయం తీసుకునే అధికారం చైర్మన్, కన్వీనర్లకే ఉంటుందని ఏజెన్సీల నిర్వాహకులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో రోగికి సరఫరాచేసే ఆహారానికి కనీస ధర రూ.72 నుంచి గరిష్ఠ ధర రూ.80 వరకు నిర్ధారించారు. దాఖలైన టెండర్లలో కనిష్ఠ ధరతో పాటు నాణ్యతా ప్రమాణాలు, ఏజెన్సీ టర్నోవర్, ట్రాక్ రికార్డులను పరిశీలించి టెండర్లు ఖరారు చేసే అధికారం ఈ కమిటీకి ఉండడంతో రాజకీయ పైరవీలకు ఆస్కారం ఏర్పడినట్లయింది. టెండర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తే, కనిష్ఠ ధర వేసినవారికి ఇవ్వాల్సి ఉంటుందని, కొన్ని సందర్భాల్లో నాణ్యమైన ఆహారం ఇచ్చే నిమిత్తం అధిక ధర కోట్ చేసినవారికి కూడా టెండర్లు అప్పగించే అవకాశం ఉంటుందని, ఈ నిర్ణయం తీసుకునే అధికారం కమిటీ చైర్మన్, కన్వీనర్లకే ఉంటుందని చెబుతున్నారు.

- మిగతా 6వ పేజీలో...

నిబంధనల ప్రకారమే కాంట్రాక్టర్ల ఎంపిక



వైద్యవిధాన పరిషత్ సూచించిన నియమ, నిబంధనల ప్రకారమే ఐదు ఆస్పత్రులకు డైట్ కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తాం. అదనపు కలెక్టర్ సమక్షంలోనే ఫైనాన్సియల్ బిడ్లు తెరవాల్సి ఉంటుంది. మంగళవారం వారు అందుబాటులోలేనందున 7వ తేదీకి వాయిదా వేశాం. అర్హత సాధించిన 53 ఏజెన్సీల ఫైనాన్షియల్ బిడ్లను పరిశీలిస్తాం. నిబంధనల ప్రకారం ఎవరు అర్హత సాధిస్తే వారికి కాంట్రాక్ట్ దక్కుతుంది. అందరూ ఒకే ధర కోట్ చేస్తే నిబంధనల ప్రకారం డ్రా తీస్తాం.

- డాక్టర్ మాతృనాయక్, డీసీహెచ్ఎస్

మెరుగైన విద్యుత్ కోసం 'ప్రజాబాట'

టీజీఎస్‌పీడీసీఎల్ రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి



నార్కట్‌పల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతును పరిశీలిస్తున్న సీఈ బాలస్వామి, ఎస్ఈ వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకే 'ప్రజాబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ ఉబ్బని బాలస్వామి అన్నారు. 'ప్రజాబాట'లో భాగంగా మంగళవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని అమ్మనబోలు క్రాస్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 'ప్రజాబాట' కొనసాగుతోందన్నారు. వారంలో మూడు రోజుల పాటు మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలు, సమస్యలను గుర్తించి వాటికి మరమ్మతులు చేస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలను శుభ్రంచేసి రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. 'ప్రజాబాట'లో మరమ్మతులు చేయాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ల ఒక రోజు ముందుగానే గుర్తిస్తామన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం కేవలం నగరపాలక, పురపాలక, మండల కేంద్రాలకే పరిమితమైందని, రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. రెండు నెలలుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు జిల్లాలో 150 ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలు గుర్తించి సరిచేసినట్లు తెలిపారు. మరమ్మతులకు కావల్సిన విడిభాగాలు, పరికరాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమతి తీసుకోకుండా విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని, 11కేవీ విద్యుత్‌లైన్ వెంట నిర్మాణాలు చేపట్టే వారి నుంచి నిరభ్యంతర లేఖ తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులు కూడా మెరుగైన సర్వీస్ పొందేందుకు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని, బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈఈ (టెక్నికల్) కృష్ణారావు, డీఈఈ (ఆపరేషన్స్) అన్నయ్య, ఏడీఈలు నవీద్ అహ్మద్, శంకరయ్య, బాల్యానాయక్, కే.చంద్రశేఖర్‌రావు, సబ్ ఇంజనీర్ యాదయ్య, ఫోర్‌మెన్ శంకర్‌నాయక్, లైన్ ఇన్స్‌పెక్టర్లు సురేశ్‌బాబు, ఎన్.వెంకటేశ్వర్ రావు, లైన్‌మెన్లు ఎండీ.ఫారూఖ్, సీహెచ్.రత్నశేఖర్, జీ.యాదయ్య, ఏఎల్ఎంలు లక్ష్మణ్, సైదులు, ఆర్టిజన్లు వెంకటేశ్, వెంకన్న పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీచేస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

దామరచర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను మండల కేంద్రంలోని రైతు వేదికలో జేడీఏ పాల్గొన్నారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేసి మాట్లాడారు. రైతులు కార్డులో సూచించిన ప్రకారం ఎరువులను వినియోగించాలన్నారు. ప్రతీ మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమానికి రైతులు తప్పక హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, ఏవో మేకల రుషేంద్రమణి, ఏఈవోలు సైదులు, పార్వతి, ప్రియాంక, రైతులు నామిరెడ్డి మట్టారెడ్డి, కొడాలి ప్రభాకర్, రాంబాబు, నాగరాజు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వట్టిమర్తి నిర్వాసితులు

చిట్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తేనే ఉదయసముద్రం ప్రాజెక్టుకు భూములు ఇస్తామని వట్టిమర్తి గ్రామానికి చెందిన రైతులు స్పష్టం చేశారు. మంగళవారం వట్టిమర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామానికి ఉదయ కాల్వ ద్వారా నీరువస్తే సంతోషమేనని అయితే భూములు కోల్పోనున్న తమకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే భూములిచ్చేది లేదని తేల్చి చెప్పారు. పరిహారం ఎకరానికి రూ.8లక్షలను చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో, పదేళ్ల కిందట నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లిలో పరిహారంగా రూ.12లక్షలను చెల్లించారని, ఇప్పుడు దానికంటే తక్కువ ఇస్తామనడం సమంజసం కాదని అభ్యంతరం తెలిపారు. సమావేశంలో ఉదయసముద్రం ప్రాజెక్టు ల్యాండ్ అక్విజేషన్ డీటీ రషీద్, స్పెషల్ ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జోరిగల శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా మోహన్‌రెడ్డి, చింతపల్లి కిష్టయ్య, దూదిగామ స్వామి, మల్లేషం, రాచకొండ శ్యాంసుందర్, పాల్గొన్నారు.

పత్తిని వెంటనే కొనుగోలు చేయాలి



మాదారంలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పత్తి రైతులు

శాలిగౌరారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తేమ శాతం పేరుతో సీసీఐ ఇబ్బంది పెడుతోందని, తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని మాదారంలోని టీఆర్ఆర్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో తేమ శాతం ఎక్కువగా ఉందని తీసుకెళ్లిన పత్తిని అధికారులు తిప్పి పంపించడాన్ని నిరసిస్తూ జాతీయ రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, వర్ష భయంతో పత్తిని విక్రయించేందుకు వస్తే అధికారులు పలు రకాలుగా కొర్రీలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తేమ శాతంతో సంబంధం లేకుండా సీసీఐ పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. తేమ శాతానికి దగ్గరలో ఉన్న కొద్ది మంది రైతుల పత్తి కొనుగోలుకు అధికారులు ఒప్పుకోవడంతో రైతులు ధర్నాను విరమించారు.

జిన్నింగ్ మిల్లుల సమ్మె విరమణ

- విరమించుకోవాలని సూచించిన కలెక్టర్
- అంగీకరించిన యజమానులు

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 6 నుంచి సమ్మెకు వెళ్లాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు యోచించిన నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం రాత్రి అధికారులు, మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పత్తి రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మెకు వెళ్లకుండా కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. పత్తి కొనుగోలులో సీసీఐ తీసుకొచ్చిన ఎల్-1, 2 నిబంధనలు తేమశాతం తదితర సమస్యలతో పత్తిని కొనుగోళ్లు చేపట్టలేమని జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు ఈనెల 6 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు కలెక్టర్‌కు నోటీస్ అందజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, మార్కెటింగ్, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. పత్తి కొనుగోలులో జిన్నింగ్ మిల్లుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనలు లేకుండా చూడాలని, తేమశాతంలో సడలింపు ఇవ్వాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు కోరగా, కలెక్టర్ స్పందిస్తూ పత్తి కొనుగోళ్లు పూర్తిగా సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందున నిబంధనల సడలింపు తన పరిధిలో లేవన్నారు. అయితే మూడు, నాలుగు రోజుల్లో, ఎల్-1, ఎల్-2 తోపాటు జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. అప్పటి వరకు సమ్మెకు వెళ్లకుండా పత్తి రైతుల పరిస్థితి దృష్టిలో ఉంచుకొని కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ కోరారు. అనంతరం సీసీఐ సీఎండీతో ఆమె మాట్లాడారు. జిన్నింగ్ మిల్లుల యజమానుల సమస్యలన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, సమ్మె లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ చేసిన విజ్ఞప్తికి యజమానులు అంగీకరించారు. పత్తి రైతులు సరైన తేమ శాతంతో జిన్నింగ్ మిల్లులకు తీసుకవచ్చేలా వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంపాలని జేడీఏ శ్రవణ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అదనపు ఎస్పీ రమేష్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, సీసీఐ అధికారి నింజే, జిన్నింగ్ మిల్లుల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణా రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

విద్యతో పాటు సృజనాత్మకత అవసరం

విద్యార్థులకు విద్యతో పాటు సృజనాత్మకత అవసరమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం రామ్‌నగర్ పార్కులో సెట్విన్ ఆధ్వర్యంలో స్వల్పకాలిక వృత్తులపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మారుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకొని చదువుతో పాటు ఒకేషనల్ కోర్సులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్, డీఈవో భిక్షపతి, ఇంటర్మీడియట్ విద్యాధికారి దస్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, పునరావాస కాలనీల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఎత్తిపోతల పథకాల కింద భూసేకరణ, అవార్డుల జారీ, అటవీ భూములకు సంబంధించిన పరిష్కారం, పరిహారం చెల్లింపులను ఆమె సమీక్ష చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉద్యమం

టీఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 62 శాతంగా ఉన్న బీసీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఉద్యమం సాగించాలని, ఈసారి తప్పితే మరో 50 ఏళ్ల వరకు ఉద్యమాన్ని చేపట్టలేమనే విషయాన్ని గమనించి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మేధావులు, పలు సంఘాల నేతలతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్రంలో బీసీ బంద్‌కు పిలుపునిస్తే అగ్రవర్ణాలు సైతం మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. బీసీ ఉద్యమం మొదలైన తరువాత అగ్రవర్ణాలకు మంత్రి పదవితో పాటు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడానికి వెనకంజవేసే పరిస్థితి రావడానికి ఉద్యమమే కారణమన్నారు. ఇటీవల ఇద్దరు అగ్రవర్ణ ప్రజాప్రతినిధులకు మంత్రి పదవులు ఇవ్వకుండా క్యాబినెట్ హోదా కల్పించారన్నారు. బీసీలు బీసీల కోసమే పనిచేసే రోజులు వచ్చాయని, రానున్న రోజుల్లో రాజ్యాధికార పార్టీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అత్యధిక స్థానాలకు బీసీలకు కేటాయిస్తామన్నారు. అంతకముందు ఎంజీ యూనివర్సిటీని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సుదగాని హరిశంకర్‌గౌడ్, బండారపు నర్సయ్య, వట్టె జానయ్యయాదవ్, సంగెం సూర్యారావు, ఎలబోయిన ఓదేలు, విజయ్‌కుమార్, చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, వైద్యుల సత్యనారాయణ, నేలపట్ల సత్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, జనార్ధన్, ప్రభాకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెర్వుగట్టులో గిరి ప్రదక్షిణ

శ్రీకారం చుట్టనున్న విశ్వహిందూపరిషత్

నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణ ఉత్సవానికి విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లాశాఖ సంకల్పించింది. చెర్వుగట్టు ఆలయ ప్రాశస్త్యం, ఆధ్యాత్మిక ప్రాభవాన్ని మరింత చాటడమే ధ్యేయంగా వీహెచ్‌పీ ఈ కార్యక్రమానికి శ్రీకారంచుట్టింది. ఆరేళ్ల క్రితం యాదగిరిగుట్ట దేవస్థానం వద్ద ప్రారంభించిన తరహాలోనే గిరిప్రదక్షిణను చెర్వుగట్టులో కూడా ప్రారంభించాలని నిర్ణయించింది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలై అరుణాచల క్షేత్రంలో ప్రతీ రోజు జరిగే గిరిప్రదక్షిణకు పలు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. అదే మాదిరిగా పురాణ ప్రాశస్త్యం ఉన్న చెర్వుగట్టు క్షేత్రంలోనూ గిరిప్రదక్షిణ ప్రారంభించాలని ఏడాది కిందటే సంకల్పించామని, కానీ కార్యాచరణకు ఇంత కాలం పట్టిందని వీహెచ్‌పీ ధర్మాచార్య నల్లగొండ జిల్లా ప్రముఖ్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక, యాత్రాస్థలాలకు ప్రాచుర్యం కల్పించేలా కార్యాచరణ చేపట్టాలనే సంకల్పంలో భాగంగానే చెర్వుగట్టు దేవస్థానంలో గిరిప్రదక్షిణకు నాంది పలుకుతున్నామన్నారు. ప్రస్తుతం గుట్ట చుట్టూరా పత్తి చేను ఉన్నందున ఎల్లారెడ్డిగూడెం వద్ద ఉన్న ఆర్చీ నుంచి ప్రారంభించి చెర్వుగట్టు గ్రామం నంది సర్కిల్, పార్వతీ అమ్మవారి ఆలయం నుంచి నల్లచెర్వు కట్ట మీదుగా తిరిగి ఎల్లారెడ్డిగూడెం ఆర్చి వరకు చేరుకోవడంతో గిరిప్రదక్షిణను ముగిస్తామని తెలిపారు. ప్రతీ నెల పౌర్ణమి, అమావాస్య తిథుల్లో రెండు పర్యాయాలు గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్తీక పౌర్ణమి రోజున ఉదయం 6గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభిస్తామని ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నిడమనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాల సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో పుట్లల శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌తో పాటు ఫార్మసీ, స్టోర్ రూమును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వోలు కేసా రవి, గీతావాణి, మండల వైద్యాధికారులు డాక్టర్ కేవీ.అరవింద్, డాక్టర్ బంగారు రమ్య, సీహెచ్‌వో రమేష్, ఎల్టీ కృష్ణయ్య, గంటా సోమయ్య, తదితరులు ఉన్నారు.

యాదగిరిగుట్టపై ఇంటెలిజెన్స్ ఆరా

5

ఆధ్యాత్మికం, పర్యాటకం.. రాజాపేట

చారిత్రక సంపదకు సాక్ష్యాలుగా నిలిచే ఆలయాలు. రాచరికపు దర్పాణానికి నిలువుటద్దంగా నిలిచే కోటగోడలు. ఆధ్యాత్మిక చింతనకు ఆలవాలమైన ఆలయాలకు యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం నెలవు. మొట్టమొదటి సంత్ సేవాలాల్ ఆలయంతో పాటు 13వ శతాబ్దాపు శివాలయం, ఎకరా విస్తీర్ణంలోని మర్రిమాను చుడముచ్చటైన బసవేశ్వరుడు ప్రతీ ఊరు ప్రత్యేకం. ఆధ్యాత్మికం, పర్యాటకం కలగలిపిన ప్రాంతం రాజాపేట. అటు జైనుల ఆరాధ్య క్షేత్రం కొలనుపాక, ఇటు యాదాద్రి, అటు కొమరవెళ్ల నడుమ ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

-(ఆంధ్రజ్యోతి-రాజాపేట)

దర్జా ఒలకబోసే కోట

నిజాం పాలనలో 14 రాచరిక సంస్థానాల్లో రాజాపేట ఒకటి. ఇక్కడ ఉన్న కోటను 1775లో రాజా రాయన్న నిర్మించారు. 25 ఎకరాల్లో ఎత్తయిన కోట గోడలతో 24 బురుజులతో కోటను మూడు ద్వారాలతో నిర్మించారు. కోట లోపల గిరిగిర్‌మాల్, అద్దాల మేడ, ఏనుగుల మోట బావి, సైనికుల కవాతు కేంద్రం, ధాన్యాగారం, అంతఃపురం, వాటర్ ఫౌంటెన్, సొరంగ మార్గం, ఎత్తయిన బురుజులు, గడి కోటలు ఉన్నాయి. ఇప్పటికీ కట్టడాలు కొన్ని చెక్కు చెదరకుండా చరిత్రకు దర్పణంగా నిలిచాయి.






రాజాపేట మండలం రేణికుంట లోని శ్రీగిరి సంకల్ప సిద్ధి వెంకటేశ్వరాలయం

రేణుకుంట శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వరాలయం..

రేణుకుంట శివారులో శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వరాలయాన్ని రెయిన్‌బో డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్మించారు. ఆరు ఎకరాల్లోని ఆలయం ప్రకృతి రమణీయతకు ఆలవాలం. మూల విరాట్టును అమృత శిలతో, మిగతా ఆలయాన్ని కృష్ణ శిలలతో నిర్మించారు. నిత్య పూజలతో పాటు ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. రాజాపేటకు కిలోమీటరు దూరంలో ఉంటుంది.



బేగంపేటలో కుసుమ హరినాథ ఆలయం

రాజాపేటకు 4కిలోమీటర్ల దూరంలోని బేగంపేటలో కుసుమహరినాథ ఆలయం ఉంది. ఆలయాన్ని బోగ నర్సయ్య దాతల సహకారంతో నిర్మించారు. హరినాథ బాబాతో పాటు పలు విగ్రహాలున్నాయి. భక్తులు నిత్యంపూజలు చేస్తుంటారు.

నెమిలలో భారీ రాతి వినాయకుడు..

నెమిల గ్రామంలో కాకతీయులు కాలం నాటి భారీ రాతి బొజ్జ వినాయక విగ్రహం ఉంది. ఈ విగ్రహం 10ఫీట్ల ఎత్తు కలిగి ఉండి ఐదు టన్నుల బరువుంటుంది.

పుట్టగూడెం సంత్ సేవాలాల్ ఆలయం

పుట్టగూడెంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ ఆలయం ఉంది. జిల్లాలోనే మొదటి ఆలయంఇది.

మేడారం నెలవు చల్లూరు..



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి 12 కిలోమీటర్ల దూరంలో చల్లూరు గ్రామం ఉంది. ఇక్కడ శివ శంకర ఆలయం నిర్మించిన 45 ఎత్తులో తొమ్మిది పడగల నాగేంద్రుడుతో శివలింగాన్ని నిర్మించారు.

చిన్నమేడారం: చిన్నమేడారం గ్రామంలో సమ్మక్క-సారలమ్మ దేవాలయాన్ని 1994లో నిర్మించారు. సమ్మక్క, సారలమ్మ, శ్రీలక్ష్మీ, జంపన్న, కోడెల, ఎల్లమ్మదేవి, పగిడిద్ద రాజు గద్దెలను ఏర్పాటుచేశారు. రెండేళ్లకు ఒకసారి జాతరను నిర్వహిస్తారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు 2 నుంచి 3లక్షల మంది భక్తులు వస్తుంటారు. రాజాపేట మండల కేంద్రం నుంచి 6 కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంటుంది.

● యాదాద్రి జిల్లా మేడారంగా పేరున్న సమ్మక్క-సారలమ్మ ఆలయం చల్లూరులో ఉంది. చుట్టూ గుట్టలతో, ప్రకృతి ఒడిలో ఈ ఆలయం ఉంది. రెండేళ్లకోసారి జాతరను ఇక్కడ నిర్వహిస్తారు.



బూరుగుపల్లి మర్రిచెట్టు

రాజాపేట మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలోని బూరుగుపల్లి గ్రామంలో సుమారు ఎకరం విస్తీర్ణంలో మర్రిచెట్టు ఉంది. 200 ఏళ్ల నాటిదిగా చెబుతుంటారు. పెద్దపెద్ద ఊడలు కలిగిన ఈ చెట్టు కింద పోచమ్మ ఆలయం ఉండటంతో పోచంమర్రిగా పిలుస్తారు. ప్రతీ ఏడాది శ్రావణమాసంలో గ్రామస్థులు బోనాల పండుగను ఈ మర్రి కిందే నిర్వహిస్తారు.

కుర్రారం బసవేశ్వరాలయం

కుర్రాంలోని బసవేశ్వరాలయం అతి పురాతనమైంది. 13, 14 శతాబ్దంలో అవిటి వాడైన బస్వయ్య అనే వ్యక్తి నల్లటి రాయితో అద్భుతంగా నిర్మించాడు. ఆలయంలో ని శిల్పాలు అద్భుతంగా ఉంటాయి. స్థంబాలకు నాగుపాముల పడగలు వెనకగా ఉండడం ఇక్కడి విశేషం. ఆలయంలో శివలింగంతో పాటు నంది విగ్రహం రామప్పలో ఉన్న నందిని పోలి ఉంటుంది.

వేంకటశ్వరుడు కొలువైన రఘునాథపురం

రఘునాథ్‌పూరం పవర్ లూం పరిశ్రమకు ప్రసిద్ధి. దాతల సహకారంతో ఇక్కడ భూదేవి, శ్రీదేవి సహిత శ్రీ వేంకటేశ్వరాలయాన్ని నిర్మించి నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. శ్రీగోదాదేవి, స్వామివారి కల్యాణోత్సవాలను ఘనంగా జరుపుతారు. యాదగిరిగుట్టకు 10 కిలోమీటర్ల దూరంలో ఈఆలయం ఉంటుంది.

బొందుగుల మెట్ల బావి

బొందుగుల గ్రామంలోని శివాలయలో కాకతీయుల కాలంలో నిర్మించిన మెట్లబావి ఉంది. పెద్దబండరాళ్లతో నిర్మించారు. బావి అడుగు భాగం వరకు మెట్లను నిర్మించారు. ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉంది.

టూరిజం హబ్‌గా ఏర్పాటు చేయాలి



రాజాపేట మండలంలో పురాతన ఆలయాలు, రాచరికపు కోటలు ఉన్నాయి. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి 10 నుంచి 20 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే మండల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. పర్యాటకంతో పాటు మండలం మరింత అభివృద్ధి చెందుతుంది. ఆర్థిక వనరులు పెరుగుతాయి. యాదగిరిగుట్ట, కొలనుపాక, కొమురవెళ్లి, రాజాపేట ప్రాంతాలను కలిపి టూరిజం హబ్‌గా ఏర్పాటుచేయాలి.

- సత్యనారాయణ,గ్రామస్థుడు,చల్లూరు

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

బీబీనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బల్కంపేటకు చెందిన బైరు జగన్(36) పిజ్జాలు తయారుచేసి పలు హోటళ్లకు సరఫరా చేసే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వచ్చే ఆదాయంతో జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా వ్యాపార అవసరాల కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు తీర్చడం కష్టంగా మారింది. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్ల పెరగడంతో తీర్చే పరిస్థితి కనిపించకపోవడంతో మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన జగన్ అదే రోజు రాత్రి బీబీనగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం చెరువు కట్ట మార్గంలో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన స్థానికులకు నీటిలో మృతదేహం తేలుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు మృతదేహం ఫొటోలను చేరవేశారు. కుటుంబసభ్యులు జగన్ కనిపించడంలేదని స్థానిక బల్కంపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పటికే ఫిర్యాదుచేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. దీంతో పోలీసులు జగన్ వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. ఈ ఘటనపై జగన్ భార్య పూర్ణిమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


చికిత్స పొందుతూ వివాహిత మృతి



అనూష(ఫైల్‌ఫొటో)

నేరేడుచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వేధింపులు తాళలేక రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసి చికిత్సపొందుతున్న యువతి మంగళవారం మృతి చెందింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల పట్టణ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన తవుడోజు అనూష(28)కు నల్లగొండకు చెందిన దాసోజు జితేందర్‌తో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. కుమార్తె జన్మించిన తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఏడేళ్ల కిందట భర్తతో విడిపోయింది. అప్పటి నుంచి తండ్రి నర్సింహాచారి వద్దనే ఉంది. నాలుగేళ్ల కిందట తండ్రి నర్సింహాచారి మృతి చెందడంతో మేనమామ సోమాచారి ఇంటి వద్ద ఉంటోంది. పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులోని ఓ రెడీమెడ్ దుకాణంలో పనిచేస్తున్న సమయంలో పట్టణ పరిధిలోని నర్సయ్యగూడెం ప్రాంతానికి చెందిన నన్నెపంగు మధుతో పరిచయం ఏర్పడింది. కొద్ది రోజులుగా అనూష వేరే వ్యక్తితో మాట్లాడుతుందని అనుమానిస్తూ వేధింపులకు గురి చేయడంతో ఈ నెల 2న అనూష ఉరివేసుకుంది. గమనించిన కుమార్తె, మేనమామకు చెప్పడంతో వెంటనే అనూషను కాపాడి మిర్యాలగూడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అనూష మృతి చెందింది. సోమాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అలుగు చూసేందుకు వెళ్లి..



రాజయ్య(ఫైల్‌ఫొటో)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలో చెరువులో కాలు జారి పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణంలోని తంగెడపల్లి గ్రామానికి చెందిన శామకూర రాజయ్య(55) చెరువు నిండి అలుగుపోస్తుండడంతో చెరువును చూసేందుకు కుమారుడు, బంధువులతో కలిసి వెళ్లాడు. చెరువు కట్టపై కూర్చున్న రాజయ్య ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయాడు. చెరువులో బండరాయి ఉండడంతో తలకు బలమైన గాయమై చెరువులోనే మృతి చెందాడు. మృత దేహాన్ని స్థానికులు తాళ్ల సాయంతో బయటకుతీశారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజయ్యకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. రాజయ్య లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

గుడిబండలో డిజిటల్ చోరీ

వాట్సాప్‌లో యాప్ ద్వారా రూ.2.5 లక్షలు మాయం

కోదాడ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్‌లో వచ్చిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో అతడి అకౌంట్‌లోని రూ.2.50 లక్షలు చోరీ అయ్యాయి. ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుడిబండ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మొబైల్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. అతడికి వాట్సాప్‌లో వచ్చిన ఎపిక్ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేశాడు. దీంతో అకౌంట్‌లో ఉన్న రూ.2.50 లక్షలు డిజిటల్ చోరీ అయ్యాయి. దీంతో సైబర్ క్రైం 193 నెంబర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుపై రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాట్సాప్‌లో వచ్చే యాప్‌లింక్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు

అర్వపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా నాగారం సీఐ నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం అర్వపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. అర్వపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ విరామం తీసుకుంటున్న సమయంలో కొందరు ఉద్దేశ్యపూర్వకంగా వీడియో తీసి తప్పుడు ప్రచారం చేశారన్నారు. వారిపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

నేలరాలిన రైతుల ఆశలు



(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)

హుజూర్‌నగర్‌లో అకాల వర్షంతో నేలవాలిన పంట పొలాలు

వానాకాలం సీజన్ రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది. ముఖ్యంగా సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో రైతులు అత్యధికంగా వరి పంటను నష్టపోయారు. ముక్త్యాల బ్రాంచ్‌కెనాల్, జాన్‌పహాడ్ మేజర్ పరిధిలో వరి పంట ఎక్కువగా సాగు చేశారు. దీంతో పాటు మేళ్లచెర్వు, మఠంపల్లి, చింతలపాలెం మండలాల్లో పెద్దమొత్తంలో పత్తి సాగు అయ్యింది. కోదాడ డివిజన్‌లో సైతం మెట్టపంటలు అధికంగా సాగుచేయగా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో పత్తి, మిర్చి పంటలు వేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 6 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేయగా భారీ వర్షాలతో రైతులు నష్టపోయారు. నెలరోజుల్లో వరి పంట ఇంటికి వచ్చే దశలో వర్షాలు అన్నదాతలను కుదేలుచేసింది. జూన్, జూలై మాసాల్లోనే రైతులు పెద్దమొత్తంలో సాగుచేశారు. కాగా పంట పొలాలన్నీ పొట్టదశలో ఉండగా, కొన్నిచోట్ల గింజలు పోసుకుని కోతకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిలాచ్చాయి. సూర్యాపేట జిల్లాలో వానాకాలం సీజన్‌లో 5.89 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేశారు. వరి 4.85 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 92 వేల ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు సాగు చేశారు. అధికారుల గణాంకాల ప్రకారం మొంథా తుపాన్‌తో వరి పంట 54 వేల ఎకరాల్లో, పత్తి, ఇతర పంటలు 10 వేల ఎకరాలు నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనావేశారు.

పంట సర్వే పనుల్లో అధికారులు

వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించే పనిలో వ్యవసాయాధికారులు ఉన్నారు. ఇంతలోనే మంగళవారం కురిసిన భారీ వర్షానికి మరింత తీవ్ర నష్టం చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్ డివిజన్‌లో లక్షా 40వేల ఎకరాల్లో వరి, మరో 40వేల ఎకరాలలో పత్తి, మిర్చి పంటలు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా వేశారు. కాగా మంగళవారం కురిసిన వర్షానికి జిల్లాలో మరో 30వేల ఎకరాల్లో పంట నష్టపోయినట్లు రైతు సంఘాలు తెలిపాయి. మొత్తంగా చూస్తే లక్ష ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లినట్లు రైతు సంఘాలు, అన్నదాతలు పేర్కొంటున్నారు. ప్రతీ ఎకరానికి కనీసం రూ.30వేల నష్ట పరిహారం చెల్లించాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. కాగా మంగళవారం హుజూర్‌నగర్‌లో 25.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలి



సీసీఐ అధికారులు ఆంక్షలు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి. గిట్టుబాటు ధర కల్పించాలి. వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందజేయాలి. నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలి.

పల్లా నర్సింహారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

పంట నష్టంపై ప్రాథమిక అంచనా వేసున్నాం

పంట నష్టంపై ప్రాథమిక అంచనా వేస్తున్నాం. తుపాన్‌తో పాటు మంగళవారం కురిసిన భారీవర్షంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం. మండల స్థాయిలో వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమచేస్తాం. తుపాన్‌తో సుమారు 64వేల ఎకరాలు నష్టపోయినట్లు అంచనా వేశాం.

శ్రీధర్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా వ్యవసాయాధికారి

సీసీఐలో మద్దతు ధర పొందాలి

పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లోని పంటను విక్రయించి మద్దతు ధర పొందాలి. తేమలేకుండా చూసుకొని సీసీఐ కేంద్రాలకు దిగుబడులు తీసుకురావాలి. త్వరలో మరో నాలుగు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. వ్యాపారులకు పత్తిని విక్రయించవద్దు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోంది.

రవీందర్‌రెడ్డి, మార్కెట్‌కార్యదర్శి, దేవరకొండ

దేవరకొండ డివిజన్‌లో ఎన్నడూ లేనంతగా..

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో ఎన్నడూలేనివిధంగా తుపాన్‌తో కూడిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. డివిజన్‌లో 1.70 లక్షల ఎకరాల్లో పత్తి, 55వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. పత్తి ఎకరానికి రూ.25వేలకుపైగా పెట్టుబడులు పెట్టారు. ఏపుగా పెరిగి పత్తి తీసే సమయానికి ఇటీవల వర్షాలకు చేనుల్లోకి భారీగా వరద చేరుతోంది. దీంతో పత్తి నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, కొండమల్లేపల్లి, పీఏపల్లి, చింతపల్లి మండలాల్లో పత్తి, వరి సాగు చేశారు. పత్తి పంట విక్రయానికి సీసీఐ కేంద్రానికి తీసుకెళ్తే తేమ ఉందని ఆంక్షలు విధిస్తూ కొనుగోలు చేయడంలేదని రైతులు నాగార్జునసాగర్ - హైదరాబాద్ జాతీయ రహదారి 167పై ఆందోళనకు దిగుతున్న సంఘటనలు ఉన్నాయి. ఆంక్షలు విధించకుండా పత్తిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు తమ వద్దకు వచ్చిన దళారులకే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

ఐదు కేంద్రాలకు ఒక్కటే ప్రారంభం

పత్తి కొనుగోళ్ల కోసం దేవరకొండ డివిజన్‌లో ప్రతీ సీజన్‌లో ఐదు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. కాని ఈ ఏడాది కొండమల్లేపల్లి పరిధిలో అక్టోబరు 29న ఒక్కటే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. మరో నాలుగు సీసీఐ కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంది. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో సీసీఐ కేంద్రాలు ప్రారంభించడానికి జాప్యం జరుగుతోందని అధికారులు తెలుపుతున్నారు. రైతులు తొందరపడి పత్తిని తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయించవద్దని, ఇంట్లో నిలువ చేసుకుని తేమశాతం లేకుండా సీసీఐ కేంద్రాలలో విక్రయించి క్వింటాల్‌కు 8100 చొప్పున మద్దతు ధర పొందాలని సీసీఐతోపాటు మార్కెటింగ్‌శాఖ అధికారులు రైతులను కోరుతున్నారు.



దేవరకొండ మండలం కాసారంలో వర్షపునీరు చేరిన పత్తిచేలు

14 వేల ఎకరాల్లో పత్తి పంట నష్టం :

దేవరకొండ డివిజన్‌లో 14వేల ఎకరాలకుపైగా పత్తి పంట నష్టం జరిగిందని, 2500 ఎకరాలలో వరి పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. డివిజన్‌లో 14వేల ఎకరాల వరకు పత్తి పంట నష్టం జరిగిందని దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మీ తెలిపారు. నివేదికను అందించామని ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిగూడెం ఎంజీయూ సమీపంలోని పెట్రోలు వద్ద సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాలిలా ఉన్నాయి. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న దాసరిగూడెం గ్రామానికి చెందిన నంద్యాల లక్మారెడ్డి సోమవారం సాయంత్రం స్వగ్రామం దాసరిగూడెంను హైవే వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని తొలుత నల్లగొండకు, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించారు. లక్మారెడ్డి పరిస్థితి విషమంగానే ఉంది.

ట్రాలీ ఢీకొని ఇద్దరికి...

కేతేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట గ్రామానికి చెందిన పులుసు జనార్థన్ ఆరోగ్యం బాగాలేకపోవడంతో గ్రామానికి చెందిన జటంగి సురేశ్‌తో కలిసి నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి ద్విచక్రవాహనంపై వచ్చి వెళ్తున్నాడు. కొర్లపహాడ్ సమీపంలో వెనుక నుంచి అజాగ్రత్తగా వచ్చిన ట్రాలీలారీని ఢీకొట్టి 20మీటర్ల దూరం వరకు ద్విచక్రవాహనాన్ని లాక్కెళ్లింది. దీంతో జనార్థన్‌కు తీవ్రగాయాలు కాగా బైక్‌ను నడుపుతున్న సురేశ్‌కు గాయాలయ్యాయి. 108 సిబ్బంది వెంటనే ఇద్దరిని నకిరేకల్ ఏరియాఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులసూచన మేరకు జనార్థన్‌కు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీసీఎం ఢీకొని..

వేములపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని డీసీఎం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శెట్టిపాలెం గ్రామానికి చెందిన రేగూరి రాము మంగళవారం పనినిమిత్తం మిర్యాలగూడకు ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తున్నాడు. గ్రామ శివారులోని అన్నపురెడ్డిగూడెం స్టేజి వద్దకు రాగానే వెనక నుంచి డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో రాముకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు.

నల్లగొండలో అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

నల్లగొండ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర దొంగను నల్లగొండ పట్టణ వన్‌టౌన్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ డీఎస్పీ కే శివరాంరెడ్డి మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన జెర్రిపోతుల రవి ఇంట్లో అక్టోబరు 25వ తేదీన చోరీ జరిగింది. ఈ ఘటనపై రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ ప్రారంభించిన సీఐ రాజశేఖర్‌రెడ్డి స్థానిక సీసీ కెమెరాలోని దృశ్యాలను పరిశీలించి చోరీకి పాల్పడిన వ్యక్తి కరుడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగ రుద్రాక్షి శ్రీనుగా గుర్తించారు. మంగళవారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై పారిపోతున్న ఓ వ్యక్తిని సీసీఎస్ బృందంతో పాటు వన్‌టౌన్ పోలీసులు పట్టుకొని విచారించారు. అతడిని రుద్రాక్షి శ్రీనుగా గుర్తించారు. శ్రీనుపై తెలుగు రాష్ట్రాల పరిధిలో సుమారు 40 వరకు దొంగతనాల కేసులు నమోదు కాగా తిరుపతిలో జైలుకు వెళ్లినప్పటికీ పద్ధతి మార్చుకోలేదు. తిరిగి 15 రోజుల క్రితం జైలు నుంచి బయటకు వచ్చిన శ్రీను నల్లగొండలోని శాంతినగర్‌లోని రవి ఇంట్లో చోరీ చేశాడన్నారు. అదేవిధంగా ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లాడని, అదేవిధంగా దేవరకొండ రోడ్డులోని కనకదుర్గా కాలనీలో దొంగతనం చేశాడన్నారు. ఈ కేసును సీసీ కెమెరాల ఆధారంగా ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించి వారం రోజుల్లోనే శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. నేరస్తుడిని నుంచి సుమారు 6 తులాల బంగారు, 35 తులాల వెండి, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సీసీఐ ఇన్‌స్పెక్టర్లు జితేందరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్, హెడ్ కానిస్టేబుల్ విష్ణు, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు సైదులు, గోపాలరావు, వెంకటనారాయణ, షకీల్, రబ్బాని, ఫింగర్ ప్రింట్స్ ఎస్ఐ శివ, సీసీఐ సిబ్బంది సాయి, మహేష్, వహీద్, దస్తగిరి, జునైద్‌లు పాల్గొన్నారు.

బంగారం దొంగల అరెస్టు

త్రిపురారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బంగారు నానుతోడు చోరీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా నిడమనూరు సీఐ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌రెడ్డి తెలిపిన వివ రాల ప్రకారం త్రిపురారంలోని బాబుసాయిపేట క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై పారిపోతున్న ఇద్దరి పట్టుకుని విచారించారు. అక్టోబరు 27న త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామంలో ద్విచక్రవాహనంపై వచ్చి మహిళ మెడలో బంగారం లాక్కెళ్లిన మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామానికి చెందిన కొండేటి చరణ్‌తేజ(23), కుంచం వెంకటేష్(26)లుగా గుర్తించారు. రూ.3.60 లక్షల విలువైన బంగారం నానుతాడు, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. గతంలో వీరిపై హైదరాబాద్, మిర్యాలగూడ, వేములపల్లి పోలీస్‌స్టేషన్‌ల్లో వివిధ కేసులు నమోదైనట్లు చెప్పారు. కేసును ఛేదించిన పోలీసులను సీఐతో, ఎస్ఐలు అభినందించారు. సమావేశంలో ఎస్ఐ కైగూరి నరేష్, సిబ్బంది చంద్రశేఖర్, రాంబాబు, ఇబ్రహీం, శ్రీను, కవిత తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

కల్తీని గుర్తించడం ఇక సులువు

కల్తీకి కాదేదీ కనర్హం. మిర్చి బండీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, ఫైవ్‌స్టార్ హోటల్ ఇలా ఏ స్థాయిలోనైనా ఏదో ఒక రూపంలో కల్తీ జరుగుతూనే ఉంది. కానీ ఎలా గుర్తించాలో తెలియదు, ఎవరైనా తనిఖీలు చేసినా అవి కల్తీ తేల్చేందుకు సమయం పట్టేది. ఇలాంటి వాటికి ఇక చెక్ పడుతోంది. ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం మొబైల్ వాహన పరీక్షలను నిర్వహిస్తోంది. దీంతో కల్తీని గుర్తించడం సులభతరమవుతోంది. నేరుగా ఆహారం కల్తీ అవుతున్న ప్రదేశానికి వెళ్లి కొద్ది నిమిషాల్లోనే పరీక్షలు జరిపి కల్తీ జరిగిందా లేదా అనే విషయం తెలుసుకోవచ్చు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

ఆహార కల్తీ అవుతున్నట్లు భావిస్తే శాంపిల్ సేకరించి వాటిని హైదరాబాద్‌లోని నాచారంలోని ప్రధాన ల్యాబ్‌కు పంపిస్తుంటారు. ఈ ల్యాబ్ నుంచి ఫలితం రావడానికి 14 రోజుల నుంచి 45 రోజుల వరకు కూడా పడుతోంది. అధిక సమయం పడుతుండటంతో ఎలాంటి చర్యలైనా ఆలస్యమయ్యేవి. దీనికి తోడు అప్పటి వరకు క్రయ, విక్రయాలు సాగేవి. ఇకపై ఇలాంటి సమస్యలకు చెక్ పెడుతూ అధికారులు మొబైల్ వాహన పరీక్షను చేస్తున్నారు. ఆహార కల్తీని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మొబైల్ వాహనాన్ని కేటాయించింది. ఒక్కో వాహనానికి సుమారు. రూ. 50లక్షల మేర ఖర్చు చేశారు. ఎక్కడైనా ఆహారం కల్తీ అవుతున్నట్లు ఫిర్యాదు అందితే ఆ ప్రాంతానికి పరీక్షలు నిర్వహించే మొబైల్ వాహనంతో వెళ్లి పరీక్షలు చేసి ఖచ్చిత, స్పష్టమైన ఫలితాన్ని ఇస్తున్నారు. దీంతో అపోహలు తొలగిపోవడంతో పాటు కల్తీ జరిగితే వెంటనే చర్యలకు అవకాశం ఏర్పడుతోంది.



మొబైల్ తనిఖీ వాహనంలోని పరికరాలు

నాణ్యత పెరుగుతుందని ఆశాభావం

మొబైల్ పరీక్ష వాహనాలతో ఆహార నాణ్యత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లాలో 3 వేల నుంచి 4 వేల మధ్య హోటళ్లు, చిరుతిండ్ల తోపుడు బండ్లు, బేకరీలు, ఫుడ్ ట్రాక్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా చాలా వరకు లైసెన్స్ లేకుండా వ్యాపారం సాగిస్తున్నారు. వీటిలో జరిగే ఆహార కల్తీని గుర్తించేందుకు గతంలో ల్యాబ్‌లు లేవు. ప్రస్తుతం ప్రభుత్వం అందజేసిన మొబైల్ వాహనంలో వెంటనే తనిఖీలు చేసి ఫలితాలు అందజేస్తున్నారు.

దాడులు నామమాత్రమే..

జిల్లా కేంద్రమైన సూర్యాపేటలో ఇటీవల పలు బేకరీల్లో అధికారులు దాడులు చేశారు. కొంతమేర కల్తీ జరిగినట్లు గుర్తించారు. గతంలో సైతం హోటళ్లలో దాడులు చేసి కల్తీ ఆహారాన్ని మురుగుకాల్వల్లో పడబోశారు. ఇలా అడపదడప దాడులు చేస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో దాడులు చేసి కల్తీని అరికట్టడంలేదని అధికారుల తీరుపై ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఏడాదిలో 25దాడులు చేయగా వాటిల్లో ఆహార పదార్థాలు 12, నాణ్యత లేని ఉత్పత్తులు 18 గుర్తించి వీరికి రూ.1.55లక్షల జరిమానా విధించారు. అయితే ప్రస్తుత వాహనం ఉండటంతో అధికంగా కేసులు వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది.

కల్తీని సులభంగా గుర్తించవచ్చు

మొబైల్ పరీక్షా వాహనంతో కల్తీ ఆహారాన్ని సులభంగా గుర్తించవచ్చు. తక్కువ సమయంలో స్పష్టమైన ఫలితం వస్తుంది. నిత్యం జిల్లాలో దాడులు చేస్తున్నాం. వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠినచర్యలు తీసుకుంటాం.

ప్రభాకర్, సూర్యాపేట జిల్లా ఆహారభద్రతా అధికారి

ప్రయోజనాలు

1.) ఈ వాహనాల మూలంగా ఆహారం కల్తీ జరిగిందా లేదా అనే విషయాన్ని నిమిషాల్లో తెలుసుకోవచ్చు.

2). తక్కువ ఖర్చుతో కూడిన పరీక్షలు.

3). మారుమూల ప్రాంతాలకు, కొండ ప్రాంతాలకు సైతం వెళ్లి పరీక్షలు చేయవచ్చు.

4. వేగవంతం, ఖచ్చితమైన ఫలితాలు అందుతాయి.

5. రోడ్డు పక్కన ఉన్న తినుబండారు బండ్లతో పాటు పాలు, నూనె, సుగంధ ద్రవ్యాలు, నిత్యావసర పదార్థాల కల్తీని వెంటనే గుర్తించవచ్చు

6. ప్రజలు తాము కొన్న ఆహార పదార్థం కల్తీ ఉంటే నేరుగా పరిక్షించుకోవచ్చు.

పేదింటి విద్యాకుసుమం

● **లెక్చరర్‌గా ఎంపికైన రేషన్‌డీలర్ కుమార్తె వెన్నెల**



(ఆంధ్రజ్యోతి-కనగల్)

నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీఎడవల్లికి గ్రామానికి చెందిన పోలె వెన్నెల నేటి యువకుత స్ఫూర్తిగా నిలుస్తోంది. తల్లిదండ్రుల కష్టాలు కడతేర్చాలంటే ప్రభుత్వ ఉద్యోగమొకటే లక్ష్యంగా భావించింది. పట్టుదలతో చదివి ఇటీవల లెక్చరర్ ఉద్యోగం సాధించింది. పెద్దగా స్థిరచరాస్తులు లేని పోలె సర్వయ్య-అరుణ దంపతులకు నలుగురు సంతానంలో ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పిల్లల చదువుకు, కుటుంబ అవసరాల కోసం ఉన్న ఎకరం భూమిని తల్లిదండ్రులు తనఖాపెట్టారు. సర్వయ్య రేషన్‌డీలర్‌గా చేస్తుండగా, అతడి భార్య కూలీ పనులు చేసేది. ఇద్దరు కష్టపడి వచ్చే సంపాదనతో పిల్లలను చదివించారు. కుమార్తె వెన్నెల నల్లగొండ ఎన్జీ కళాశాలలో బీఎస్సీ, కేరళ రాష్ట్రంలో పీజీని పూర్తి చేసింది. తల్లిదండ్రులు ఇబ్బందులను చూసి చలించింది. తమ కుటుంబం పేదరికాన్ని అధిగమించాలంటే చదువొక్కటే మార్గమని భావించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)లో పనిచేస్తూ మరోపక్క పోటీ పరీక్షలకు సిద్ధమైంది. ఇటీవల ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ పోస్టుకు పరీక్ష రాసి విజయం సాధించింది. ఈ ఏడాది మార్చిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి నియామకపత్రాన్ని అందుకుంది. నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకురాలిగా ఉద్యోగంలో చేరింది. కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది. పేద కుటుంబంలో పుట్టినా పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించింది. తల్లిదండ్రుల కలలను సాకారం చేసి నేటి యువతకు ఆదర్శంగా నిలిచింది. కాగా వెన్నెల అక్క సంధ్య చర్లపల్లి గురుకుల కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తుండగా తమ్ముళ్లలో సాయిరాం ఇటీవలే బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. మరో తమ్ముడు గౌతమ్ న్యూఢిల్లీలో ఉంటూ సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పిల్లల చదువుకు ప్రాధాన్యమిచ్చినట్లు సర్వయ్య-అరుణ దంపతులు తెలిపారు. కూలీ పనులకు వెళ్లి మరీ వారిని చదివించామని వివరించారు. తమ కుమార్తె వెన్నెల ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందన్నారు.

గుట్టపై అడుగడుగునా ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా

యాదగిరిగుట్ట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో నెలకొన్న అవినీతి బాగోతం రాష్ట్ర వ్యాప్తంగా సంచలం సృష్టిస్తోంది. ఇన్‌చార్జుల పాలనలో దేవస్థాన వ్యవస్థ పూర్తిగా అదుపు తప్పి అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ నేపథ్యంలో కొండపైన రెండో రోజు మంగళవారం ఇంటలిజెన్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఆరా తీశారు. యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలోని గోశాల మినహా ప్రసాద కౌంటర్లు, ఆలయ పరిసరాలు, శివాలయం, పరిపాలన విభాగం, కొండకింద ఆధ్యాత్మిక వాడల్లో అన్నదాన సత్రం, సత్యదేవుని వ్రత మండపాలు, అద్దె గదులు తదితర విభాల్లో అధికారులు పరిశీలించారు. కొబ్బరికాయలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణల వెలువడగా అధికారులు స్పందించారు. దేవస్థానానికి పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిందేనని కొంతమంది భక్తులు అధికారులకు తెలిపారు. పలు విభాగాల్లో చాలా కాలంగా తిష్ఠ వేసిన ఆలయ అధికారుల అవినీతి, అక్రమాలపై కూడా తీశారు. గత రెండు రోజులుగా ఇంటలీజెన్స్ అధికారులు కొండపై ఆరా తీయడం స్థానికంగా చర్చనీయమైంది. ఆరా తీసిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు బుధవారం అందజేయనున్నట్లు తెలిసింది.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విమల ఎంపిక



హుజూర్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలోని మిట్టగూడెంకు చెందిన సలికంటి విమల రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎన్నికయ్యారు. ఇటీవల హుజూర్‌నగర్‌లో జరిగిన జిల్లా స్థాయి అండర్ -17 పోటీల్లో మొదటి బహుమతి సాధించింది. కాగా మిట్టగూడెంకు చెందిన సలికంటి రవి, అశ్విని దంపతుల కుమార్తె విమల భువనగిరి జిల్లా మోటకొండూర్‌లోని గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది. నాలుగేళ్లుగా వివిధ విభాగాల్లో కబడ్డీ పోటీల్లో రాణిస్తోంది. . ఈనెల 10, 11, 12 తేదీలలో దామచర్లలో నిర్వహించనున్న పోటీల్లో, అనంతరం 18న కొత్తగూడెం జిల్లాలో జరగనున్న అండర్-17 పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. విమలను కబడ్డీ అసోసియేషన్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామపెద్దలు అభినందించారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ జట్టుకు నస్రీన్..



శాలిగౌరారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం చెరువుఅన్నారంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ సెలక్షన్లు నిర్వహించారు. అండర్-14 విభాగంలో శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని ఎస్‌కే నస్రీన్ మంచి ప్రతిభ కనబరిచి ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికైందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన నస్రీన్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడు బొడ్డు మల్లేష్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

పేరూరు వంతెనకు తాత్కాలిక మరమ్మతులు

హాలియా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నల్లగొండ జిల్లా అనుముల మండలం పేరూరు- మదారిగూడెం మధ్యలో ఉన్న వంతుప కొట్టుకుపోయింది. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆదేశానుసారం అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వంతెనకు రెండు రోజుల నుంచి తాత్కాలిక మరమ్మతులే చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు జానపాటి రామలింగయ్యయాదవ్, రాజు, య డవల్లి రామకృష్ణ, గ్రామస్థులు, ఘని అబ్బర్, పసుల శ్రీరాములు, పసుల రవి, అన్వర్, రషీద్, చిన్నబోయిన శ్రీనయ్య, గోపనబోయిన మంగయ్య, రవి, సంతోష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తాం

మేళ్లచెర్వు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులతో పాటుగా గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి వ్యాధి తీవ్రత తగ్గేవరకు గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయమనోహరి తెలిపారు. సోమవారం కామెర్ల వ్యాధితో మృతి చెందిన బాలుడు సుజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను మంగళవారం మేళ్లచెర్వులో పరామర్శించారు. అనంతరం వ్యాధి వ్యాప్తి చెందటానికి కారణమైన స్కూల్ పరిసరాలను పరిశీలించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు శ్రీశైలం సతీష్‌గౌడ్, మండల వైద్యాధికారి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

మేళ్లచెర్వు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెం సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంఈవో వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి భావన ఆదినారాయణ మాట్లాడుతూ మేళ్లచెర్వులోని ఓ పాఠశాలలో కలుషిత నీటిని తాగి అనేక మంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడ్డారని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడిన ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి అశోక్, నరేష్, సైదులు, వివిధ పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాసనగోడులో ముగిసిన అమాన్ అంత్యక్రియలు

కేతేపల్లి, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కాసనగోడులో నీటిగుంటలో పడి మృతిచెందిన బాలుడు అమాన్ మృతదేహానికి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనల మధ్య మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే అమాన్ నీటి గుంటలో పడిమృతిచెందాడని సిబ్బందిని తొలగించాలనే డిమాండ్‌తో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు అమాన్ మృతదేహంతో ఆందోళనకు దిగడంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించలేదు. అయితే సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు అమాన్ మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బాలుడి మృతదేహాన్ని అప్పగించడంతో మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

అంగన్‌వాడీలో బాలుడి మృతికి బాధ్యులపై చర్యలు.

అయాన్ అనే బాలుడి మృతికి బాధ్యులపై కలెక్టర్ సూచన మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ చర్యలు చేపట్టింది.ఈ మేరకు గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన ఇరువురు కార్యకర్తలు మాచర్ల జానమ్మ, చల్లా సునీత, ఇరువురు ఆయాలు మాచర్ల నాగమ్మ, బొజ్జ రమణమ్మను తాత్కాలికంగా విధుల నుంచి తప్పిస్తూ స్త్రీశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను బొప్పారం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రం నిర్వహకులకు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలోని మరుగుదొడ్ల వినియోగంపై నిర్లక్ష్యం, అంగన్‌వాడీ కేం ద్రం సమీపంలో ఉన్న ప్రమాదకరమైన గుంటలను పూడ్చివేయించకపోవడం, అంగన్‌వాడీ కేంద్రాల కేంద్రాల నిర్వహకులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో విఫలమైనందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో ఈ నెల 6వ తేదీ వరకు వివరణ ఇవ్వాలని పేర్కొంటూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అలాగే నకిరేకల్ సెక్టార్ సీడీపీవోకు అధికారులు మెమో జారీ చేశారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ట్రీనిటీ విద్యాసంస్థల సౌజన్యంతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 69వ 14 ,17 సంవత్సరాల బాల, బాలికల మల్కంబ్ క్రీడా రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యం, సంపూర్ణ ఆరోగ్యం, శారీరక దృఢత్వం పెంపొందుతాయన్నారు. ప్రైవేట్ పాఠశాలలతో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నడిపించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి బడ్జెట్ లో ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని సంవత్సరాలుగా విద్యారంగానికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించడం లేదని, విద్య ప్రాముఖ్యాన్ని గుర్తించడంలేదని అన్నారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సెల్ ఫోన్లకు దూరంగా ఉంచి చదువుకు, క్రీడలకు దగ్గరగా ఉంచాలని ఆయన సూచించారు. మర్రిగూడలోని కేజీబీవీ వసతి గృహంలో విద్యార్థినులకు ఎనిమిది బాత్‌రూంలే ఉన్నందున ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని, వెంటనే కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా రూ.1.50 కోట్లు వెచ్చించి ఆధునాతన సౌకర్యాలను కల్పించానన్నారు. ట్రీనిటీ విద్యార్థులు చేసిన మల్కంబ్ క్రీడా విన్యాసాలు, నృత్య రూపకాలను ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ వీరాబాయి, ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, డీఈవో సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ చిల్కూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ కోఆర్డినేటర్ పబ్బు రాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దశరథరెడ్డి, ఎంఈవో గురువారావు, ట్రీనిటీ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ వి. మంజుల, చైర్మన్ కృష్ణారావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్ , సీనియర్ నాయకులు ఎం.రమేష్ , బి.బాలకృష్ణ, బత్తుల విప్లవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఏడు ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి.



చౌటుప్పల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



క్రీడా పోటీల్లో ట్రీనిటీ విద్యా సంస్థల విద్యార్థుల విన్యాసం

మత్స్యగిరీశుడికి అలంకార ఉత్సవం

వలిగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి గుట్టపైన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనారసింహుడి కల్యాణం అనంతరం అలంకార మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో స్వామిని స్తుతిస్తూ రుత్వికులు పంచామృతాలతో మంగళస్నానం జరిపారు. పలు విధ పుష్పాలు, తులసి మాలతో అభిషేకిస్తూ అలంకార సేవ కన్నులపండువగా జరిగింది. ఉత్సవ మండపంలో స్వామిని లక్ష్మీదేవిని ముత్యాల పల్లకిలో అధిష్ఠింపజేశారు. అనంతరం స్వాములను పుర వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. అనతరం శ్రీసుదర్శ నారసింహ ఇష్టి వేడుకను నిర్వహించారు. భక్తులు ధ్వజస్తంభం కింద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, దేవస్థాన ఘాట్ రోడ్డు నిర్మాణ దాత శ్రీమతి గార్లపాటి పుష్పలత సురేందర్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్‌రెడ్డి, దేవస్థానం ఈవో మోహన్‌బాబు, ధర్మకర్త మండలి, అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

క్షేత్ర పాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనా లతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి నివేదించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపం లోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,05,021 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో జి. రవినాయక్ తెలిపారు. కాగా, హన్మకొండకు చెందిన ఏపూరు శ్రావణ్‌కుమార్ మంగళవారం స్వామికి రూ. 10లక్షల చెక్కును ఇన్‌చార్జి ఈవోకు అందజేశారు. ఈ నగదులో రూ.8లక్షలు నిత్యాన్నదాన పథకానికి, రూ.2లక్షలు గరుడ ట్రస్టుకు కేటాయించారు.



క్షేత్రపాలకుడికి హారతి నివేదిస్తున్న అర్చకులు

నేడు కార్తీక దీపారాధన..

శివకేశవులు కొలువుదీరిన యాదగిరిగుట్టపై నేడు కార్తీక దీపారాధన నిర్వహిస్తారు. పవిత్ర కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో అన్నకూటోత్సవం నిర్వహించి ప్రధానాలయంలోని స్వామివారి నిత్య కల్యాణం తర్వాత మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు గోష్ఠి గర్భాలయ శుద్ధి కార్యక్రమం అనంతరం ఉభయ దర్శనాలు ప్రారంభిస్తారు. శివాలయంలో సాయంత్రం 6.30 గంటలకు ఆస్థాన మండపంలో ధ్వజస్తంభం వద్ద పూజా కార్యక్రమాలు చేపట్టి ఆకాశ (కార్తీక) దీపారాధన చేస్తారు. కాగా, కొండకింద ఆధ్యాత్మిక వాడలో మండపంలో 297 జంటలు వ్రతాలు జరిపించినట్లు పర్యవేక్షకుడు దొమ్మాట సురేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి పర్వదినాన ఎనిమిది విడతలు వ్రతాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా, భక్తుల రద్దీ మేరకు మరో విడత నిర్వహించేందుకు కూడా మండపాలను సిద్ధం చేశారు.

మట్టపల్లి క్షేత్రంలో

మఠంపల్లి: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తెలిపారు. ముఖద్వారం వరకు క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక శివాలయంలోనూ జ్వాలా తోరణం, మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణోత్సవాల్లో పాల్గొనే వారికోసం అన్ని వసతులు కల్పించామన్నారు. తెల్లవారు జామున కార్తిక స్నానాలు ఆచరించి కృష్ణానదిలో కార్తీకదీపాలను వదిలేందుకు ప్రహ్లాద, మార్కేండేయ ఘట్టాల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామన్నారు. కాగ, నరసింహ మాలలు ధరించిన స్వాములు పౌర్ణమి రోజున ఇరుముడులు స్వీకరించి మండల దీక్షలు విరమించనున్నారు.

ఇక్కత్ చీరల తయారీపై అవగాహన

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమపై అవగాహన కల్పించేందుకు మంగళవారం భూదాన్‌పోచంపల్లిలోని కళా పునర్వి యూనిట్‌ను తెలంగాణ మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థులు క్షేత్ర స్థాయి సందర్శనకు వచ్చారు. రంగారెడ్డి జిల్లా మంచాల పరిధిలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఆరుట్ల విద్యార్థులు పోచంపల్లి ఇక్కత్ చీరల తయారీ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఇక్కడికి సందర్శించారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత ఇక్కత్ చీరల తయారీ ప్రక్రియలు డిజైన్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ పద్ధతులు, రిటైల్ మేనేజ్‌మెంట్, కస్టమర్ సర్వీస్ వంటి అంశాలపై యనిట్ నిర్వాహకులు సాయిని భాస్కర్, సాయిని భరత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుప్రియ మాట్లాడుతూ ఉన్నత విద్యతోపాటు విద్యార్థులు వృత్తి నైపుణ్యాలు సాధించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. ఇలాంటి ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుప్రియ, ఉపాధ్యాయులు రాములు, మెండు రాజవర్ధన్‌రెడ్డి, చింతకింది రామలత, ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరుచుకున్న పులిచింతల గేట్లు

చింతలపాలెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చింతలపాలెం మండలం పులిచింతల ప్రాజెక్టుకు ఎగువన మూసి, శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జునసాగర్ నుంచి దిగువన పులిచింతల ప్రాజెక్టు వరకు ప్రాజెక్టులన్నీ నిండు కుండల్లా ఉన్నాయి. ఎగువ నుంచి ఏ కొద్ది ప్రవాహాలు కొనసాగుతున్నందున మొత్తం ప్రాజెక్టుల గేట్లు ఎత్తినీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అందులో మంగళవారం పులిచింతల ప్రాజెక్టుకు 69,808 క్యూసెక్కుల నీరు రావడంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఒక గేటు 3.5 మీటర్లు, మరో గేటు 3 మీటర్ల ఎత్తు చొప్పున పైకి ఎత్తి 51805వేల క్యూసెక్కుల నీళ్లను గేట్ల నుంచి, జల విద్యుత్ కేంద్రం నుంచి 17 వేల క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు, 45.77 టీఎంసీలుగా ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 174.506 అడుగులు, 45.00 టీఎంసీలు నీటి నిల్వ ఉన్నది.


విద్యుత్ అధికారుల' ప్రజా బాట'

కొండమల్లేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే ధ్యేయంగా విద్యుత్ సంస్థ ముందుకు సాగుతోందని విద్యుత్ డీఈ విద్యాసాగర్ తెలిపారు. ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిబ్బందితో కలిసి ఆయన దేవరకొండ రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా డీఈ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రతి మంగళ, గురు, శని వారాల్లో ఉదయం గంట పాటు సిబ్బందితో కలిసి ప్రజా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఏమైనా సమస్యలు ఉంటే అందుబాటులో ఉన్న విద్యుత్ సిబ్బందికి/ తన దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియరల్ లైన్ ఇన్‌స్పెక్టర్ వన్‌పాల్, చందు, సబ్ ఇంజనీర్ మల్లేష్, రవి, నవీన్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి పట్టా అందజేత

డిండి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా డిండి మండలం తవక్లాపూర్ గ్రామానికి చెందిన భయ్యా నేహ భవాని డాక్టర్ ఆఫ్ ఫార్మసీ పట్టా అందుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో శ్రీమతి సరోజిని రాములమ్మ ఫార్మసీ కళాశాలలో నేహ భవాని 2019 నుంచి 2025 వరకు విద్యను అభ్యసించింది. మంగళవారం జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో నేహ భవానికి పట్టాను ఐపీఎస్ అధికారి జానకి ఐపీఎస్, జైళ్ల శాఖ జిల్లా సూపరింటెండెంట్ వెంకటేశం, శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.బాలరాజు, ప్రిన్సిపాల్ మంగీలాల్ పాల్గొన్నారు.

పశువుల కాపరి అదృశ్యం



వెంకటేశ్వర్లు

కోదాడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలో పశువుల కాపరి అదృశ్యమయ్యాడు. కోదాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 50 సంవత్సరాల వయసున్న భూక్య వెంకటేశ్వర్లు ఈ నెల రెండో తేదీ మధ్యాహ్నం పశువులను మేపడానికి తమ్మర వాగు కాలువ వద్ద వెళ్లాడు. అతను ఇంటి రాకపోవడంతో ఆ ప్రాంతానికి కుటుంబ సభ్యులు వెళ్లగా పశువులు మాత్రమే ఉన్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికిన తండ్రి కనిపించలేదు. రాత్రి కూడా ఇంటికి రాలేదు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వెంకటే శ్వర్లు కాలువలో కొట్టుకుపోయి ఉంటాడనే అనుమానంతో రెస్క్యూ టీంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే వాగు వెంబడిగ్రామాల ప్రజలు కోదాడ పట్టణ సీఐ సెల్ నెం. 8712686009కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

నేటినుంచి నిత్య అన్నదాన కార్యక్రమం

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఆర్య సమాజ ఆవరణలో ఈ నెల 5వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాలె సతీష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప, హనుమాన్, శివమాల స్వాములు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రతిరోజూ 12.30గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

చిట్యాలరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిమినేడుకు చెందిన వివాహిత అదృశ్యమైంది. ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెలిమినేడుకు చెందిన మంకాల బుచ్చయ్య భార్య రేణుక గత నెల 31వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రయినా తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధు మిత్రుల నివాసాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. తన భార్య అదృశ్యమైందని భర్త బుచ్చయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యాసంగి ధాన్యానికి బోనస్ చెల్లించాలి



శాసనమండలి చైర్మన్ గుత్తాకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యానికి సంబంధించి బోనస్ చెల్లించేలా కృషిచేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బోనస్ రాక ఆరు నెలలు కావడంతో అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏప్రిల్ యాసంగిలో సాగు చేసిన ధాన్యానికి మిల్లర్లు క్వింటాల్‌కు రూ.2400 ధర నిర్ణయించారని, రూ.500ల బోనస్ వస్తుందని ఐకేపీలో విక్రయించామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు దార భిక్షమయ్య, విజయ్, భాస్కర్, రామలింగయ్య, కాశయ్య, బాబు, వెంకటయ్య, శ్రీను, జానకిరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, భాస్కర్ నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి

చిట్యాల, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిమర్తి గ్రామంలో ఉదయసముద్రం ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న భూమికి ఎకరానికి రూ.2.8లక్షలు చెల్లించడం అన్యాయమన్నారు. మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.80లక్షలు ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జొర్రీగల శ్రీనివాసులు, ఐతరాజు నర్సింహ, చింతపల్లి కృష్ణయ్య, లడె రాములు, దూదిగామ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం అమలు చేయాలి

చిట్యాల, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయం అమలు చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఏళ్ల అనంతరెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించే పెన్షనర్ల నిరసనదీక్ష పోస్టర్లను మంగళవారం చిట్యాలలో విడుదల చేశారు. పెన్షనర్లకు రావాల్సిన ప్రయోజనాలు ఏకమొత్తంలో చెల్లించాలన్నారు. 2023 నుంచి పీఆర్సీ అమలు చేస్తూ బకాయిలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఆర్‌లు బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి తాటి చంద్రమౌళి, కోశాధికారి బుద్ద కృష్ణమూర్తి, వీరమల్ల లింగయ్య, కోమటిరెడ్డి నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన ఉండాలి

చిట్యాల, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో లావణ్య కోరారు. బేటీ పడావో, బేటి బచావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిట్యాలలోని లయోలా హైస్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 18 ఏళ్లు నిండాక, జీవితంలో అన్ని విధాలా స్థిరపడిన తర్వాత పెళ్లి చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే 1098 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో వెంకటమ్మ, స్కూల్ ప్రిన్సిపాల్ సుందర్‌రాజ్, అంగన్‌వాడీ సిబ్బంది జానకిలక్ష్మి, ఉష, సునీత, దాడి అరుణ, అపర్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి రూ.50 వేల ఆర్థిక సాయం

నార్కట్‌పల్లి, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న సహవిద్యార్థికి(క్లాస్‌మేట్లు) పూర్వ విద్యార్థులు రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని అమ్మనబోలుకు చెందిన బైరోజు హరికృష్ణ అనారోగ్యానికి గురై ఇబ్బంది పడుతున్నాడు. 2007-08లో గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు విషయం తెలుసుకుని స్పందించారు. స్నేహితునికి అండగా నిలవాలనుకుని సేకరించిన మొత్తం రూ.50 వేలను మంగళవారం హరికృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో బాసాని జానీ, కన్నెబోయిన సత్యనారాయణ, శ్రీశైలం, మచ్చగిరి పరమేశ్, దేవర నవీన్, బొబ్బిలి రాజు, సురువు శివ, రాజు, పల్లగొర్ల మమత, రాధిక, బొక్క రజిత పాల్గొన్నారు.

మునుకుంట్లలో కంటి వైద్య శిబిరం

కట్టంగూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునుకుంట్ల గ్రామంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు కింగ్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య కంటి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజన్ టెక్నీషియన్ స్వాతి 200మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15మందిని కంటి ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. అనంతరం మునుకుంట్ల, ఈదులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ఓరుగంటి శ్రీనివాస్, అగర్వాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు చిక్కు శేఖర్, నిమ్మల పిచ్చయ్య, రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, రాములు, మంగదుండ్ల శ్రీనివాస్, తవిడబోయిన నర్సింహ, రాపోలు వెంకటేశ్వర్లు, కడవేరు మల్లికార్జున్, గడుసు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీ దిశగా..



తగ్గుతున్న బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ నీటి మట్టం (ఫైల్)

- నీటి నిల్వ తగ్గుతున్న బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్!
- ప్రస్తుతం ఎడమ కాల్వ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల
- నీటి విడుదల ఇలాగే కొనసాగితే 10రోజుల్లో డెడ్ స్టోరేజీకి

నార్కట్‌పల్లి, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతో జిల్లాలోని ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. కానీ మండలం లోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్ మళ్లీ డెడ్‌స్టోరేజీకి చేరువలో ఉంది. గతంలోనూ భారీ వర్షాలు పడి చెర్వులు, కుంటలు నిండిన సమయంలో కూడా ఈ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీలోనే ప్రస్తుతం ఈ రిజర్వాయర్ నుంచి ప్రధాన ఎడమ కాల్వ ద్వారా నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని కొన్ని చెర్వులకు నీటిని మళ్లిస్తున్నారు. ఈ నీటి విడుదల ఇలాగే కొనసాగితే ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వ పరిమాణం ఆధారంగా ఇంకా 10 రోజులు మాత్రమే కాల్వ ద్వారా నీటిని విడుదల చేసే అవకాశముంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం (0.302 టీఎంసీలు కాగా) ప్రస్తుతం 0.06 టీఎంసీల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు. తర్వాత డెడ్ స్టోరేజ్‌కు చేరనుంది. సెప్టెంబర్ 16వ తేదీ నుంచి మోటారును ఆన్‌చేసి రిజర్వాయర్‌లోకి నీటి విడుదల చేసిన అధికారులు సెప్టెంబరు 24 వరకు కొనసాగించారు. తర్వాత నుంచి మోటార్లను నడపలేదు. ఓవైపు ఎడమకాల్వ ద్వారా నీటి విడుదల మరోవైపు మోటార్లు ఆగిపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి.

ఓఅండ్‌ఎం ఇవ్వడం సాంకేతికంగా కుదరదు

బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్‌లోకి నీటి విడుదలకు సం బంధిత ప్రాజెక్టు నిర్మాణ కంపెనీ ఓఅండ్‌ఎం ఇవ్వాలని మెలిక పెట్టిన మాట వాస్తవమే. కానీ ఆ కంపెనీ కోరినట్లుగా ఓఅండ్‌ఎం ఇవ్వడం సాంకేతికంగా కుదరదు. ఇదే విషయాన్ని జిల్లాకు చెందిన మంత్రితో పాటు శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. ఓఅండ్‌ఎం ఇవ్వడానికి వచ్చే అభ్యంతరాలను సదరు కంపెనీ యాజమాన్యానికి విశదపర్చి రెండు మూడు రోజుల్లో పంపులను నడిపించి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసేలా ప్రయత్నం చేస్తాం.

- అజయ్‌కుమార్, సీఈ, నీటిపారుదల శాఖ

ఓఅండ్‌ఎం కోసం మెలిక

కట్టంగూరు మండలం పిట్టంపల్లి నుంచి సొరంగం ద్వారా చౌడంపల్లి వద్ద నిర్మించిన సర్జ్ పూల్ వరకు పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి నీరు చేరనుంది. ఇక్కడి నుంచి పంప్ హౌస్‌లో ఉన్న రెండు మోటార్లు నడపడం ద్వారా బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తి పోయాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణ ఒప్పందం మేరకు ప్రాజెక్టు ప్రారంభమైన రోజు నుంచి ఐదు సంవత్సరాల వరకు సంబంధిత నిర్మాణ కంపెనీయే ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ (ఓఅండ్‌ఎం) చేయాల్సి ఉంటుంది. రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ మాత్రం మోటార్లను నడిపేందుకు నీటిపారుదల శాఖ అధికారుల వద్ద మెలిక పెట్టినట్లు తెలిసింది. 2024 డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వాయర్‌ను ప్రారంభించి రెండు మోటార్లను అధికారికంగా ఆన్ చేసినందున ఓఅండ్‌ఎం ఇవ్వాల్సిందేనని తాజాగా తెగేసి చెప్పిన కారణంగానే మోటార్లు నడవడం లేదని తెలిసింది. ఓ వైపు జిల్లాలో పెద్ద ఎత్తున వర్షాలు కురిసి భారీ నీటి ప్రాజెక్టులు కూడా నీటితో కళకళలాడుతుంటే బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ మాత్రం ఈ కారణంగానే క్రమంగా డెడ్ స్టోరేజీకి చేరువవుతోంది.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని గడియారం సెంటర్‌లో మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇవాల్సిన సాల్కర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్‌పై క్యాబినెట్‌లో చర్చించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై కపట ప్రేమ చూపుతుందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8వేల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కుర్ర సైదానాయక్, కొరే రమేష్, బుడిగ వెంకటేష్, రవీందర్, కిరణ్, జగన్, సైఫ్, నవదీప్, న్యూమన్, రియాజ్, సాయి, వెంకట్, అఖిల్, మహేష్, కార్తీక్, సంపత్, వర్షిత్, రామలింగం, రాజేష్, మల్లేష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో జ్ఞానప్రకాష్

కట్టంగూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని ఎంపీడీవో జ్ఞానప్రకాశ్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని చెరువుఅన్నారం ప్రభుత్వ హైస్కూల్‌లో అండర్ 17, అండర్ 14 బాలబాలికల 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలో రాణించాలన్నారు. మారుమూల గ్రామాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలను నిర్వహించటం పట్ల హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను అభినందించారు. సెలక్ట్ అయిన విద్యార్థులు ఈనెల 7 నుంచి 9 వరకు నారాయణ పేట జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, పంచాయతీ సెక్రటరీ మామిడి ఉపేందర్ ఉన్నారు.

విద్యుత్ సిబ్బంది 'పల్లెబాట'

కనగల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎడవల్లి, చెట్లచెన్నారం గ్రామాల్లో విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో లూస్‌లైన్లను గుర్తించి సరిచేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించారు. డీటీఆర్ మెయిటెనెన్స్ పనులు చేపట్టారు. ట్రాన్స్‌కో ఏఈ ఆర్‌ఎస్‌జేకుమార్ మాట్లాడుతూ టీజీ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పల్లెబాట చేపట్టినట్టు తెలిపారు. విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐలు మట్టయ్య, పాండు లైన్‌మన్లు అంజల్‌రావ్, పాలకూరి నగేష్‌గౌడ్, ఏఎల్‌ఎం జానయ్య, జేఎల్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై మహిళకు గాయాలు

నకిరేకల్, సెప్టెంబరు 4, (ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకై ఇంటి గోడ కూలి ఓ మహిళకు గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని నోములలో జరిగింది. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యల్మకంటి లక్ష్మమ్మ ఉదయం వంట చేసి కూలి పనికి వెళ్లే హడావిడిలో గ్యాస్‌ను సరిగ్గా బంద్ చేయలేదు. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత వంట చేద్దామని స్టవ్‌ను వెలిగించే క్రమంలో వెంటనే స్టౌ నుంచి మంటలు వచ్చి పేలిపోయింది. ఆ తాకిడికి ఇంటి గోడ సైతం కూలిపోయింది. ఈ ప్రమాదంలో వంట సామాగ్రి, కుర్చీలు, దస్తులు, కాలిపోయాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతులను ఆదుకోవాలి : ఎమ్మెల్సీ సత్యం

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రైతులు పంటల సాగు కోసం అప్పులు చేసి పంటలు పండించారని, పంటలు చేతికొచ్చే సమయానికి తుపాన్‌తో నష్టపోయారన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎకరాకు వరి రూ.40వేలు, పత్తికి రూ.60వేల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవానికి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గురి నర్సింహ, పబ్బు వీరస్వామి, కెఎస్‌రెడ్డి, గంట సత్యనారాయణ, దోటి పాండరి, రాంకోటి, జిల్లా యాదగిరి, సురేందర్, వెంకన్న, యాదయ్య, లెనిన్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

'రజకులకు రక్షణ చట్టం చేయాలి'

చిట్యాల, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): సమాజంలో దళితుల తర్వాత వివక్షకు గురవుతున్న రజకులకు కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా రక్షణ చట్టం చేయాలనీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాలలో జరిగిన రజక వృత్తిదారుల సంఘం మండల మహసభలో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రజక వృత్తిదారులకు ఇచ్చిన హమీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకు పెద్దులు, ఐతరాజు నర్సింహ్మ, అక్కెనపల్లి నాగయ్య, అమరోజు రాములు, ఐతరాజు పెద్దనర్సింహ్మ, పాలమాకుల అర్జున్, ఐతరాజు సైదులు, నడపరాజు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి మాజీమంత్రి పరామర్శ

కనగల్, నవంబరు 4: (ఆంధ్రజ్యోతి) కనగల్ మాజీ ఎంపీపీ కరీంపాష, బీఆర్‌ఎస్ నాయకుడు లతీఫ్ సోదరి రజియా సుల్తానా(45) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మాజీమంత్రి జగదీష్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి తదితరులు మండలంలోని కాశవారిగూడెంలో రజియా సుల్తానా పార్థివదేహాన్ని మంగళవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్ మాజీ జడ్పీటీసీలు చిట్ల వెంకన్న, తండు సైదులుగౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ రామగిరి శ్రీధర్‌రావ్, నాయకులు ఊర సత్యానారాయణరెడ్డి, నల్లబోతు యాదయ్య, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

డైట్ కాంట్రాక్టుల కోసం రాజకీయ పైరవీలు!

(3వ పేజీ తరువాయి)

అయితే జిల్లాలోని ఐదు ఆస్పత్రులకు వచ్చిన టెండర్లలో ఏజెన్సీలన్నీ ఒకే ధరను కోట్ చేసినట్లు చర్చ సాగుతోంది. టెండర్లలో పాల్గొన్న ఏజెన్సీలన్నీ ఒకే ధరను కోట్ చేస్తే డ్రా తీసి కాంట్రాక్టర్‌ను ఎంపికచేస్తారు. లేదంటే చైర్మన్, కన్వీనర్‌కు ఉండే విస్తృతాధికారాల మేరకు ఏజెన్సీ ట్రాక్ రికార్డు, టర్నోవర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని డ్రా నిర్వహించకుండానే కాంట్రాక్ట్ అప్పగించే అవకాశం ఉందని ఏజెన్సీలు అభిప్రాయపడుతున్నాయి. ఈ కాంట్రాక్టులను ఎలాగైనా దక్కించుకోవాలని యత్నిస్తున్న ఏజెన్సీల నిర్వాహకులు మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు చర్చ సాగుతోంది. జిల్లాలో ఇటీవల జరిగిన ఒక డైట్ కాంట్రాక్ట్ విషయంలో వేర్వేరు కారణాలు చూపుతూ, డ్రా తీయకుండా ఏజెన్సీని ఎంపిక చేశారని, ఇప్పుడు సైతం అలాగే కాంట్రాక్టులు పొందేందుకు రాజకీయనేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారని, టెండర్లలో పాల్గొన్న మిగతా ఏజెన్సీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్యవిధాన పరిషత్ ఉన్నతాధికారులు, కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీహెచ్‌వో ఈ పరిస్థితిని గమనించి పారదర్శకంగా టెండర్ల ప్రక్రియను నిర్వహించాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దని ఏజెన్సీల నిర్వాహకులు కోరుతున్నారు.

అన్నదాతల అరిగోస



శాలిగౌరారం మండలం రామగిరిలో నేలకొరిగిన వరి



శాలిగౌరారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించి చేతికొచ్చిన పంటచేలు నేలకొరగడం, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం వర్షానికి తడవడంతో రైతులు అరిగోస పడుతున్నారు. ప్రతి సంవత్సరం రైతు పండించిన ధాన్యాన్ని అమ్ముకునే సమయానికి అకాల వర్షంతో నిండా మునుగుతున్నారు. శాలిగౌరారం మండలంలో 18 వేల ఎకరాల్లో వరి పంట సేద్యం చేయగా దాదాపు ఆరు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలిసింది. శాలిగౌరారం, రామగిరి, శాలిలింగోటం, అడ్లూర్, ఊట్కూరు, అంబారిపేట, తుడిమిడి, గురజాల, చిత్తలూరు గ్రామాల్లో వరి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. అన్ని గ్రామాల్లో ఏర్పాటు ఐకేపీ కేంద్రాల్లో కూడా ధాన్యం తడిసి ముద్దయింది. రామగిరి గ్రామంలో నిమ్మల వీరస్వామికి చెందిన మూడేకరాలన్నర చేతికొచ్చిన వరి చేను నేలపాలై మొలకెత్తింది. మరి కొంతమంది వరి చేలు నీట మునిగి పోయాయి. కోసిన ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లో పోయగా తరచూ వస్తున్న వర్షాలకు మ్యాచర్ రాకపోవడం రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని కేంద్రాలు నత్తనడక నడవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది ఇలా ఉండగా పత్తి పండించిన రైతులు కూడా అనేక అవస్థలు పడుతున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని సీసీఐలో తిరస్కరిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. మాదారంలోని టిఆర్‌ఆర్ కాటన్ మిల్లు వద్ద రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామాల వారీగా జరిగిన పంట నష్టాలను గుర్తించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం తక్కువగా ఉన్న వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యమంతా అకాల వర్షాలకు తడిసి పోతుంది. ధాన్యం ఆరబెట్టుకునే లోపే మళ్లీ వర్షం వచ్చి ధాన్యం తడిసి ముద్దయిపోతుంది. మ్యాచర్ రాకపోవడంతో ధాన్యం కొనుగోలు చేయక పోవడం వల్ల రైతులు మరింతగా నష్ట పోతున్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలి. నా మూడేకరాలన్నర వరి చేను నేలకొరిగి మొలకత్తింది.

● వేముల పర్వతాలు, రైతు శాలిగౌరారం

మొంథా బాధిత రైతులను ఆదుకోవాలి : సీపీఎం



పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నార్కట్‌పల్లి, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయిన పత్తి, వరి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెంలలోని పలువురు రైతులు పత్తి, వరి చేలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. తుపాన్ మూలంగా తడిసిన పత్తి, వరి ధాన్యాన్ని తేమతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలని, అదేవిధంగా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మొంథా తుఫాన్‌తో జరిగిన నష్టాన్ని అతి త్వరగా అంచనా వేయాలని, ప్రభుత్వం కూడా నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే తడిసిన ధాన్యాన్ని మొలకెత్తకముందే ప్రభుత్వం కొనుగోలు చేయాలని తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, మహిళా సంఘం నాయకురాలు తుమ్మల పద్మ, పార్టీ మండల కమిటీ సభ్యులు చెర్కు పెద్దులు, దండు రవి, బొల్లెద్దు సైదులు, దండు నాగరాజు, శ్రీను, అంతటి సత్యనారాయణ, మాదగోని సైదులు, దండు శంకరయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 21.4
ANDHRAJYOTHY
నల్లగొండ
3
బుధవారం 5 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.40 (310.2522)	44,095	44,095
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	6,527.50	6,527.50
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు	లైవ్ : రూ.148	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.250



ఆస్పత్రుల్లో రోగులకు భోజనం సరఫరా చేసే కాంట్రాక్టుల కోసం ఏజెన్సీల నిర్వాహకులు పైరవీలు ముమ్మరం చేశారు. కాంట్రాక్టు దక్కించుకునేందుకు దొడ్డిదారి ప్రయత్నాలు ప్రారంభించారు. ఉన్నతాధికారులపై రాజకీయ ఒత్తిడి తెచ్చి కాంట్రాక్టులు దక్కించుకునేందుకు యత్నిస్తున్నారు. జిల్లాలోని ఐదు ఏరియా ఆస్పత్రులు, ఒక కమ్యూనిటీ ఆస్పత్రికి సంబంధించి రోగులు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరా చేసే కాంట్రాక్టుకు ఇటీవల అధికారులు టెండర్లు ఆహ్వానించారు. వాస్తవానికి ఈ టెండర్ల ఫైనాన్షియల్ బిడ్లను మంగళవారమే తెరవాల్సి ఉండగా,7వతేదీకి వాయిదా వేశారు.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

డైట్ కాంట్రాక్టుల కోసం రాజకీయ పైరవీలు!

- జిల్లాలో నాలుగు ఏరియా, ఒక కమ్యూనిటీ ఆస్పత్రికి డైట్ సరఫరాకు టెండర్లు
- అర్హత సాధించిన 53 ఏజెన్సీలు
- 7న ఫైనాన్షియల్ బిడ్లు తెరిచి కాంట్రాక్టర్ల ఎంపిక
- అందరూ ఒకే ధర కోట్ చేస్తే డ్రా విధానం
- డ్రాకు వెళ్లకుండా నేరుగా కాంట్రాక్ట్ పొందేందుకు కొందరి యత్నాలు


రాజకీయ టెండర్ దక్కించుకునేందుకు నేతల పైరవీలు ఉధృతమవడంతో కాంట్రాక్టు ఖరారు ప్రక్రియ పారదర్శకంగా సాగడంపై టెండర్ బిడ్లు దాఖలు చేసిన ఏజెన్సీల నిర్వాహకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రోగులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఐదు ఏరియా ఆస్పత్రులు, ఒక కమ్యూనిటీ ఆస్పత్రి

జిల్లాలో వైద్యవిధాన పరిషత్ నిర్వహణలో ఉన్న మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, నకిరేకల్ ఏరియా ఆస్పత్రులతోపాటు, మర్రిగూడెంలోని సామాజిక వైద్యశాలలో రోగులకు, డ్యూటీ డాక్టర్లకు భోజనం అందించే కాంట్రాక్ట్ నిమిత్తం వైద్యవిధాన పరిషత్ టెండర్లను ఆహ్వానించింది. అందుకు ఆసక్తి, అర్హత ఉన్న ఏజెన్సీల నుంచి అక్టోబరు 29వరకు టెండర్లు తీసుకున్నారు. ఈ టెండర్లలో మంగళవారం టెక్నికల్ బిడ్లను పరిశీలించగా, 53 అర్హత ఉన్న వాటిని నిర్ధారించారు. వీటి ఫైనాన్షియల్ బిడ్లను తెరిచేందుకు అదనపు కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రక్రియను ఈనెల 7వ తేదీకి వాయిదా వేశారు. అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షణాధికారి కన్వీనర్‌గా ఉండే కమిటీ, కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తుంది. ఈ కమిటీలో వీరిద్దరితో పాటు డీఎంహెచ్‌వో, ముగ్గురు వైద్యులు, డైటీషియన్, ఇద్దరు సామాజికవేత్తలు సభ్యులుగా ఉంటారు. అయితే కాంట్రాక్టర్ల ఎంపికలో తుది నిర్ణయం తీసుకునే అధికారం చైర్మన్, కన్వీనర్లకే ఉంటుందని ఏజెన్సీల నిర్వాహకులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో రోగికి సరఫరాచేసే ఆహారానికి కనీస ధర రూ.72 నుంచి గరిష్ఠ ధర రూ.80 వరకు నిర్ధారించారు. దాఖలైన టెండర్లలో కనిష్ఠ ధరతో పాటు నాణ్యతా ప్రమాణాలు, ఏజెన్సీ టర్నోవర్, ట్రాక్ రికార్డులను పరిశీలించి టెండర్లు ఖరారు చేసే అధికారం ఈ కమిటీకి ఉండడంతో రాజకీయ పైరవీలకు ఆస్కారం ఏర్పడినట్లయింది. టెండర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తే, కనిష్ఠ ధర వేసినవారికి ఇవ్వాల్సి ఉంటుందని, కొన్ని సందర్భాల్లో నాణ్యమైన ఆహారం ఇచ్చే నిమిత్తం అధిక ధర కోట్ చేసినవారికి కూడా టెండర్లు అప్పగించే అవకాశం ఉంటుందని, ఈ నిర్ణయం తీసుకునే అధికారం కమిటీ చైర్మన్, కన్వీనర్లకే ఉంటుందని చెబుతున్నారు.

- మిగతా 6వ పేజీలో...

నిబంధనల ప్రకారమే కాంట్రాక్టర్ల ఎంపిక



వైద్యవిధాన పరిషత్ సూచించిన నియమ, నిబంధనల ప్రకారమే ఐదు ఆస్పత్రులకు డైట్ కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తాం. అదనపు కలెక్టర్ సమక్షంలోనే ఫైనాన్సియల్ బిడ్లు తెరవాల్సి ఉంటుంది. మంగళవారం వారు అందుబాటులోలేనందున 7వ తేదీకి వాయిదా వేశాం. అర్హత సాధించిన 53 ఏజెన్సీల ఫైనాన్షియల్ బిడ్లను పరిశీలిస్తాం. నిబంధనల ప్రకారం ఎవరు అర్హత సాధిస్తే వారికి కాంట్రాక్ట్ దక్కుతుంది. అందరూ ఒకే ధర కోట్ చేస్తే నిబంధనల ప్రకారం డ్రా తీస్తాం.
- డాక్టర్ మాతృనాయక్, డీసీహెచ్ఎస్

మెరుగైన విద్యుత్ కోసం 'ప్రజాబాట'

టీజీఎస్‌పీడీసీఎల్ రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి



నార్కట్‌పల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతును పరిశీలిస్తున్న సీఈ బాలస్వామి, ఎస్ఈ వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకే 'ప్రజాబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ ఉబ్బని బాలస్వామి అన్నారు. 'ప్రజాబాట'లో భాగంగా మంగళవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని అమ్మనబోలు క్రాస్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 'ప్రజాబాట' కొనసాగుతోందన్నారు. వారంలో మూడు రోజుల పాటు మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలు, సమస్యలను గుర్తించి వాటికి మరమ్మతులు చేస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలను శుభ్రంచేసి రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. 'ప్రజాబాట'లో మరమ్మతులు చేయాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ల ఒక రోజు ముందుగానే గుర్తిస్తామన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం కేవలం నగరపాలక, పురపాలక, మండల కేంద్రాలకే పరిమితమైందని, రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. రెండు నెలలుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు జిల్లాలో 150 ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలు గుర్తించి సరిచేసినట్లు తెలిపారు. మరమ్మతులకు కావల్సిన విడిభాగాలు, పరికరాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమతి తీసుకోకుండా విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని, 11కేవీ విద్యుత్‌లైన్ వెంట నిర్మాణాలు చేపట్టే వారి నుంచి నిరభ్యంతర లేఖ తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులు కూడా మెరుగైన సర్వీస్ పొందేందుకు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని, బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈఈ (టెక్నికల్) కృష్ణారావు, డీఈఈ (ఆపరేషన్స్) అన్నయ్య, ఏడీఈలు నవీద్ అహ్మద్, శంకరయ్య, బాల్యానాయక్, కే.చంద్రశేఖర్‌రావు, సబ్ ఇంజనీర్ యాదయ్య, ఫోర్‌మెన్ శంకర్‌నాయక్, లైన్ ఇన్స్‌పెక్టర్లు సురేశ్‌బాబు, ఎస్.వెంకటేశ్వర్‌రావు, లైన్‌మెన్లు ఎండీ.ఫారూఖ్, సీహెచ్.రత్నశేఖర్, జీ.యాదయ్య, ఏఎల్ఎంలు లక్ష్మణ్, సైదులు, ఆర్టిజన్లు వెంకటేశ్, వెంకన్న పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీచేస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

దామరచర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను మండల కేంద్రంలోని రైతు వేదికలో జేడీఏ పాల్గొన్నారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేసి మాట్లాడారు. రైతులు కార్డులో సూచించిన ప్రకారం ఎరువులను వినియోగించాలన్నారు. ప్రతీ మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమానికి రైతులు తప్పక హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, ఏవో మేకల రుషేంద్రమణి, ఏఈవోలు సైదులు, పార్వతి, ప్రియాంక, రైతులు నామిరెడ్డి మట్టారెడ్డి, కొడాలి ప్రభాకర్, రాంబాబు, నాగరాజు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వట్టిమర్తి నిర్వాసితులు

చిట్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తేనే ఉదయసముద్రం ప్రాజెక్టుకు భూములు ఇస్తామని వట్టిమర్తి గ్రామానికి చెందిన రైతులు స్పష్టం చేశారు. మంగళవారం వట్టిమర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామానికి ఉదయ కాల్వ ద్వారా నీరువస్తే సంతోషమేనని అయితే భూములు కోల్పోనున్న తమకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే భూములిచ్చేది లేదని తేల్చి చెప్పారు. పరిహారం ఎకరానికి రూ.8లక్షలను చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో, పదేళ్ల కిందట నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లిలో పరిహారంగా రూ.12లక్షలను చెల్లించారని, ఇప్పుడు దానికంటే తక్కువ ఇస్తామనడం సమంజసం కాదని అభ్యంతరం తెలిపారు. సమావేశంలో ఉదయసముద్రం ప్రాజెక్టు ల్యాండ్ అక్విజేషన్ డీటీ రషీద్, స్పెషల్ ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జోరిగల శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా మోహన్‌రెడ్డి, చింతపల్లి కిష్టయ్య, దూదిగామ స్వామి, మల్లేషం, రాచకొండ శ్యాంసుందర్, పాల్గొన్నారు.

పత్తిని వెంటనే కొనుగోలు చేయాలి



మాదారంలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పత్తి రైతులు

శాలిగౌరారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తేమ శాతం పేరుతో సీసీఐ ఇబ్బంది పెడుతోందని, తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని మాదారంలోని టీఆర్ఆర్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో తేమ శాతం ఎక్కువగా ఉందని తీసుకెళ్లిన పత్తిని అధికారులు తిప్పి పంపించడాన్ని నిరసిస్తూ జాతీయ రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, వర్ష భయంతో పత్తిని విక్రయించేందుకు వస్తే అధికారులు పలు రకాలుగా కొర్రీలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తేమ శాతంతో సంబంధం లేకుండా సీసీఐ పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. తేమ శాతానికి దగ్గరలో ఉన్న కొద్ది మంది రైతుల పత్తి కొనుగోలుకు అధికారులు ఒప్పుకోవడంతో రైతులు ధర్నాను విరమించారు.

జిన్నింగ్ మిల్లుల సమ్మె విరమణ

- విరమించుకోవాలని సూచించిన కలెక్టర్
- అంగీకరించిన యజమానులు

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 6 నుంచి సమ్మెకు వెళ్లాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు యోచించిన నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం రాత్రి అధికారులు, మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పత్తి రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మెకు వెళ్లకుండా కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. పత్తి కొనుగోలులో సీసీఐ తీసుకొచ్చిన ఎల్-1, 2 నిబంధనలు తేమశాతం తదితర సమస్యలతో పత్తిని కొనుగోళ్లు చేపట్టలేమని జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు ఈనెల 6 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు కలెక్టర్‌కు నోటీస్ అందజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, మార్కెటింగ్, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో తన చాంబర్‌లో సమావేశమయ్యారు. పత్తి కొనుగోలులో జిన్నింగ్ మిల్లుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనలు లేకుండా చూడాలని, తేమశాతంలో సడలింపు ఇవ్వాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు కోరగా, కలెక్టర్ స్పందిస్తూ పత్తి కొనుగోళ్లు పూర్తిగా సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందున నిబంధనల సడలింపు తన పరిధిలో లేవన్నారు. అయితే మూడు, నాలుగు రోజుల్లో, ఎల్-1, ఎల్-2 తోపాటు జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. అప్పటి వరకు సమ్మెకు వెళ్లకుండా పత్తి రైతుల పరిస్థితి దృష్టిలో ఉంచుకొని కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ కోరారు. అనంతరం సీసీఐ సీఎండీతో ఆమె మాట్లాడారు. జిన్నింగ్ మిల్లుల యజమానుల సమస్యలన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, సమ్మె లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ చేసిన విజ్ఞప్తికి యజమానులు అంగీకరించారు. పత్తి రైతులు సరైన తేమ శాతంతో జిన్నింగ్ మిల్లులకు తీసుకవచ్చేలా వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంపాలని జేడీఏ శ్రవణ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అదనపు ఎస్పీ రమేష్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, సీసీఐ అధికారి నింజే, జిన్నింగ్ మిల్లుల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణా రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

విద్యతో పాటు సృజనాత్మకత అవసరం

విద్యార్థులకు విద్యతో పాటు సృజనాత్మకత అవసరమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం రామ్‌నగర్ పార్కులో సెట్విన్ ఆధ్వర్యంలో స్వల్పకాలిక వృత్తులపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మారుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకొని చదువుతో పాటు ఒకేషనల్ కోర్సులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్, డీఈవో భిక్షపతి, ఇంటర్మీడియట్ విద్యాధికారి దస్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, పునరావాస కాలనీల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఎత్తిపోతల పథకాల కింద భూసేకరణ, అవార్డుల జారీ, అటవీ భూములకు సంబంధించిన పరిష్కారం, పరిహారం చెల్లింపులను ఆమె సమీక్ష చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నిడమనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాల సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో పుట్లల శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌తో పాటు ఫార్మసీ, స్టోర్ రూమును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వోలు కేసా రవి, గీతావాణి, మండల వైద్యాధికారులు డాక్టర్ కేవీ.అరవింద్, డాక్టర్ బంగారు రమ్య, సీహెచ్‌వో రమేష్, ఎల్టీ కృష్ణయ్య, గంటా సోమయ్య, తదితరులు ఉన్నారు.

బీసీల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉద్యమం

టీఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

నల్లగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 62 శాతంగా ఉన్న బీసీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఉద్యమం సాగించాలని, ఈసారి తప్పితే మరో 50 ఏళ్ల వరకు ఉద్యమాన్ని చేపట్టలేమనే విషయాన్ని గమనించి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మేధావులు, పలు సంఘాల నేతలతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్రంలో బీసీ బంద్‌కు పిలుపునిస్తే అగ్రవర్ణాలు సైతం మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. బీసీ ఉద్యమం మొదలైన తరువాత అగ్రవర్ణాలకు మంత్రి పదవితో పాటు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడానికి వెనకంజవేసే పరిస్థితి రావడానికి ఉద్యమమే కారణమన్నారు. ఇటీవల ఇద్దరు అగ్రవర్ణ ప్రజాప్రతినిధులకు మంత్రి పదవులు ఇవ్వకుండా క్యాబినెట్ హోదా కల్పించారన్నారు. బీసీలు బీసీల కోసమే పనిచేసే రోజులు వచ్చాయని, రానున్న రోజుల్లో రాజ్యాధికార పార్టీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అత్యధిక స్థానాలకు బీసీలకు కేటాయిస్తామన్నారు. అంతకముందు ఎంజీ యూనివర్సిటీని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సుదగాని హరిశంకర్‌గౌడ్, బండారపు నర్సయ్య, వట్టె జానయ్యయాదవ్, సంగెం సూర్యారావు, ఎలబోయిన ఓదేలు, విజయ్‌కుమార్, చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, వైద్యుల సత్యనారాయణ, నేలపట్ల సత్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, జనార్ధన్, ప్రభాకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెర్వుగట్టులో గిరి ప్రదక్షిణ

శ్రీకారం చుట్టనున్న విశ్వహిందూపరిషత్

నార్కట్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణ ఉత్సవానికి విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లాశాఖ సంకల్పించింది. చెర్వుగట్టు ఆలయ ప్రాశస్త్యం, ఆధ్యాత్మిక ప్రాభవాన్ని మరింత చాటడమే ధ్యేయంగా వీహెచ్‌పీ ఈ కార్యక్రమానికి శ్రీకారంచుట్టింది. ఆరేళ్ల క్రితం యాదగిరిగుట్ట దేవస్థానం వద్ద ప్రారంభించిన తరహాలోనే గిరిప్రదక్షిణను చెర్వుగట్టులో కూడా ప్రారంభించాలని నిర్ణయించింది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలై అరుణాచల క్షేత్రంలో ప్రతీ రోజు జరిగే గిరిప్రదక్షిణకు పలు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. అదే మాదిరిగా పురాణ ప్రాశస్త్యం ఉన్న చెర్వుగట్టు క్షేత్రంలోనూ గిరిప్రదక్షిణ ప్రారంభించాలని ఏడాది కిందటే సంకల్పించామని, కానీ కార్యాచరణకు ఇంత కాలం పట్టిందని వీహెచ్‌పీ ధర్మాచార్య నల్లగొండ జిల్లా ప్రముఖ్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక, యాత్రాస్థలాలకు ప్రాచుర్యం కల్పించేలా కార్యాచరణ చేపట్టాలనే సంకల్పంలో భాగంగానే చెర్వుగట్టు దేవస్థానంలో గిరిప్రదక్షిణకు నాంది పలుకుతున్నామన్నారు. ప్రస్తుతం గుట్ట చుట్టూరా పత్తి చేను ఉన్నందున ఎల్లారెడ్డిగూడెం వద్ద ఉన్న ఆర్చి నుంచి ప్రారంభించి చెర్వుగట్టు గ్రామం నంది సర్కిల్, పార్వతీ అమ్మవారి ఆలయం నుంచి నల్లచెర్వు కట్ట మీదుగా తిరిగి ఎల్లారెడ్డిగూడెం ఆర్చి వరకు చేరుకోవడంతో గిరిప్రదక్షిణను ముగిస్తామని తెలిపారు. ప్రతీ నెల పౌర్ణమి, అమావాస్య తిథుల్లో రెండు పర్యాయాలు గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్తీక పౌర్ణమి రోజున ఉదయం 6గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభిస్తామని ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

యాదగిరిగుట్టపై ఇంటెలిజెన్స్ ఆరా

5

సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

హాలియా, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోలు, గూడ్స్ వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని హాలియా ఎస్.ఐ. సాయిప్రశాంత్ హెచ్చరించారు. హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఓవర్ లోడింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నాలుగు కేసులు నమోదు చేశారు. ఓవర్ లోడింగ్ వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఎస్ఐ తెలిపారు.

ప్రజాపాలనను విస్మరించిన ప్రభుత్వం

మిర్యాలగూడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజాపాలనను విస్మరించిందని బీజేపీ ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్ తల్లం అశోక్ అన్నారు. మంగళవారం ఈదులగూడలో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం హర్షణీయమేనని, పర్యవేక్షణ లేకుండా ప్రయాణికుల తరలింపు ప్రమాదాలను తెచ్చిపెడుతుందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని, విద్యాసంస్థల బంద్‌ను విరమింపజేయాలని కోరారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం



నిడమనూరు మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం రాశులు

నిడమనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసిన అన్నదాతలను వరుణడు వెంటాడుతున్నాడు. వరుసగా కురుస్తున్న వర్షాలకు పంటలు నీటిపాలవుతున్నాయి. రైతు కుదేలవుతున్న పరిస్థితి ఉంది. మండలంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. రైతులు ముమ్మరంగా పొలాలు కోస్తున్నారు. వివిధ గ్రామాల్లో ముందుగా సాగు చేసిన పొలాలు కోయడంతో ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పోశారు. నిడమనూరు మార్కెట్ యార్డుతో పాటు వివిధ గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని రాశులుగా పోశారు. ధాన్యం రాశులపై కొందరు రైతులు పట్టాలు కప్పినప్పటికీ కేంద్రాల్లో పట్టాలు సరిపడా లేకపోవడంతో అందరు రైతులు పట్టాలు కప్పలేదు. కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారు. కానీ ఊహించని విధంగా మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా భారీగా వర్షం కురియడంతో కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొంత ధాన్యం వరద నీటికి కొట్టుకుపోయిందని రైతులు వాపోతున్నారు. వర్షాల కారణంగా వివిధ గ్రామాల్లో పొలాలు పూర్తిగా నేలవాలాయి. రైతులకు తీరని నష్టం జరిగింది. పొలాలు నేలవాలడంతో కోత మిషన్ల ధరలు ఒక్కసారిగా పెంచారు. వర్షాలకు రహదారులు బురదమయంగా మారాయి. ప్రకృతితో పాటు ప్రభుత్వం కూడా రైతులపై కరుణ చూపడం లేదని అంటున్నారు. రైతులు ఇబ్బందులు పడుతున్నందున వెంటనే కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల మరింత వేగవంతం చేయాలని, అదేవిధంగా అధికారులు మిల్లర్లతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



ప్రవహిస్తున్న దేవరకొండ మండలంలోని తాటికోలు వాగు

పొరుతున్న తాటికోలు వాగు

దేవరకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో మంగళవారం ఉదయం నుంచి ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. దేవరకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో వర్షం కురుస్తునే ఉంది. పట్టణంలోని వీధులతోపాటు గ్రామాలలోని వీధులు వర్షానికి జలమయం అవుతున్నాయి. వర్షంతో తరచు విద్యుత్ అంతరాయం కలుగుతుంది. నాగర్ కర్నూల్ జిల్లాలో భారీగా వర్షం కురుస్తుండడంతో తాటికోలు, ఖైనంపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

జీపుజాతాను విజయవంతం చేయాలి

దామరచర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఐఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు కోరారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 19న జీపుజాతా గద్వాల్‌లో ప్రారంభమై 20న మిర్యాలగూడకు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్, ధీరావత్ లింగానాయక్, వల్లంపట్ల వెంకన్న, జమ్ముల కోటయ్య, గజ్జల లక్ష్మీనరసింహారెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

మిర్యాలగూడ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా సంయుక్త సంచాలకులు, పశువైద్యుడు జీవీ. రమేష్ అన్నారు. మండలంలోని దొండవారిగూడెంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఇప్పటివరకు మండలంలో 9538 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం పూర్తయిందని అన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి రాకుండా పాడి రైతులు తమ పశువులకు ముందస్తుగా నివారణ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యులు ఎన్. దుర్గరమాదేవి, పశుగణన సహాయకులు నాగ రాజుయాదవ్, మైత్రి, నాగరాజు, వెంకటయ్య, దొండ యాదయ్య, వీరమళ్ల సైదులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాడ్గులపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతో పంట నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఇసుకబావిగూడెం గ్రామంలో దెబ్బతిని పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.30వేల మేరా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికందే దశలో నేలవాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు.

చందంపేట: వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుంటోజు వినోదచారి డిమాండ్ చేశారు. మండలం పోలేపల్లి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ముడుదండ్ల, హంక్యతండా, చిత్రియాల, నక్కలగండితండా, తెల్దేవరపల్లి గ్రామాల్లో పత్తి, వరి పంట, వేరుశనగ వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. సమావేశంలో నాయకులు పాత్లావత్ ఆంజనేయులు, జింకల శివ, శ్రీశైలం పాల్గొన్నారు.

స్కూల్ బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లకు మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్కూల్ బస్సులు నడుపుతున్న సందర్భంలో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. హైవేలు, రద్దీ ప్రదేశాల్లో వాహనాలను జాగ్రత్తగా నడుపుతూ విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు సెల్‌ఫోనుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐలు నాగభూషణరావు, సోమనర్సయ్య, ప్రసాద్ ఉన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం



అన్నప్రసాదాలతో ముస్లిం నేత ఎండీ. జాంగీర్

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు అన్నదానం చేసి మత సామరస్యాన్ని చాటి చెప్పాడు మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డుకు చెందిన ఎండీ. జాంగీర్. మంగళవారం అయ్యప్ప సన్నిదానంలో 100మంది అయ్యప్ప స్వాములకు అన్నదానం(భిక్ష) ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాములకు స్వయంగా వడ్డించారు. అనంతరం అయ్యప్ప గురుస్వాములు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, బైరు యాదగిరి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, స్వాములు బొల్లు సత్యనారాయణ, యాదయ్య, ధర్మపురం శ్రీనివాస్‌లు, చిరంజీవి, మల్లయ్య, కృష్ణారెడ్డి, రఘుమారెడ్డి, రామయ్య, మహేందర్ పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

హాలియా, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని వదలకుండా చివరి వరకు పట్టువదలకుండా చదివితే విజయం సాధిస్తారని హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ వాడాల రాములు అన్నారు. విద్య, ఉద్యోగ పోటీ పరీక్షలపై హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా చదవాలన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు కాంపిటీటివ్ సెల్ హాలియాలో ఏర్పాటు చేస్తామని దీని ద్వారా అన్నీ పోటీల పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిల్పా, ఘన్ శ్యామ్, హైమావతి, అధ్యాపకులు ఆదిరెడ్డి, కుకుడాల ఆంజనేయులు, నాగిరెడ్డి, నక్క శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డైట్ కాంట్రాక్టుల కోసం రాజకీయ పైరవీలు!

(3వ పేజీ తరువాయి)

అయితే జిల్లాలోని ఐదు ఆస్పత్రులకు వచ్చిన టెండర్లలో ఏజెన్సీలన్నీ ఒకే ధరను కోట్ చేసినట్లు చర్చ సాగుతోంది. టెండర్లలో పాల్గొన్న ఏజెన్సీలన్నీ ఒకే ధరను కోట్ చేస్తే డ్రా తీసి కాంట్రాక్టర్‌ను ఎంపికచేస్తారు. లేదంటే చైర్మన్, కన్వీనర్‌కు ఉండే విస్తృతాధికారాల మేరకు ఏజెన్సీ ట్రాక్ రికార్డు, టర్నోవర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని డ్రా నిర్వహించకుండానే కాంట్రాక్ట్ అప్పగించే అవకాశం ఉందని ఏజెన్సీలు అభిప్రాయపడుతున్నాయి. ఈ కాంట్రాక్టులను ఎలాగైనా దక్కించుకోవాలని యత్నిస్తున్న ఏజెన్సీల నిర్వాహకులు మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు చర్చ సాగుతోంది. జిల్లాలో ఇటీవల జరిగిన ఒక డైట్ కాంట్రాక్ట్ విషయంలో వేర్వేరు కారణాలు చూపుతూ, డ్రా తీయకుండా ఏజెన్సీని ఎంపిక చేశారని, ఇప్పుడు సైతం అలాగే కాంట్రాక్టులు పొందేందుకు రాజకీయనేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారని, టెండర్లలో పాల్గొన్న మిగతా ఏజెన్సీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్యవిధాన పరిషత్ ఉన్నతాధికారులు, కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీహెచ్‌వో ఈ పరిస్థితిని గమనించి పారదర్శకంగా టెండర్ల ప్రక్రియను నిర్వహించాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దని ఏజెన్సీల నిర్వాహకులు కోరుతున్నారు.

రైతుభరోసా పెండింగ్ నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా, రుణమాఫీ నిధులు విడుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఇందుగుల గ్రామంలో మంగళవారం జరిగిన సంఘం మండల 3వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడవసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల కష్టాలు పెరిగాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన సబ్సిడీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మొంథా తుపానుతో రాష్ట్రంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు అందించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, క్యాదర్శులుగా కుంచం వెంకన్న, దేవిరెడ్డి మల్లారెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. కార్యక్రమంలో నాయకులు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, నాయకులు బొంగర్ల వెంకటయ్య, కృష్ణయ్య, మునగాల నారాయణరెడ్డి, పండుగ నాగయ్య, దుర్గయ్య, కృష్ణారెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదలచేయాలి



దేవరకొండలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండలో బీసీ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చొల్లేటి భాస్కరచారి, ఆర్‌మి శ్రీను, కోటేశ్వర్‌రావు, భాషా, శ్రీనివాసచారి, వెంకటేష్ యాదవ్, గణేష్, రాజు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కళాశాలల యాజమానులు చేపట్టిన కళాశాలలను బంద్ కొనసాగుతోంది. పట్టణ పరిధిలోని విజేత డిగ్రీ, పీజీ, హాసిత డిగ్రీ కళాశాల, మినా మహిళా ఇంజనీరింగ్, పాటు బీఈడీ, ఫార్మసీ కళాశాలల బోధన, బోధనేతర సిబ్బంది ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి, ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాలలో విజేత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్, హాసిత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మెండు వెంకటరెడ్డి, మినా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎండీ. మహిమూద్‌అలీ, కోల శ్రీనివాస్, దామిని శ్రీనాథ్ పాల్గొన్నారు. మిర్యాలగూడలోని బీసీభవన్‌లో జరిగిన సమావేశంలో బీసీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడారు. రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

కొండమల్లేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నఅడిశర్లపల్లి, బాబ్లతండా సమీపంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పాటించి 17శాతం తేమ కలిగిన గ్రేడ్-ఏ రకానికి రూ.2,389, గ్రేడ్-బి రకానికి రూ.2,369 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతులు ధాన్యాన్ని తమ పొలం వద్దనే ఆరబెట్టుకొని తాలు, మట్టి పెల్లలు లేకుండా తీసుకురావవాలని అన్నారు. రైతులు వరి ధాన్యంతో పాటు పట్టాదారు పాసు బుక్కు ఆధార్ కార్డు బ్యాంకు ఖాతా బుక్కు తప్పనిసరిగా జీరాక్స్ తీసుకురావాలని అన్నారు. రైతు యొక్క ఆధార్ కార్డు నెంబర్ సెల్ ఫోన్ నెంబర్‌కు లింక్ చేసుకోవాలనిఇ సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిఇపాల వేణుధర్‌రెడ్డి, తహశీల్దార్ నరేందర్, ఏవో జానకి రాములు, మేకల శ్రీనివాస్‌యాదవ్, రమావత్ మధునాయక్, గడ్డం శ్రీరాములు, సీఈవో పల్లా తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో రమలణారెడ్డి తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసి, పరిసరాలను పరిశీలించారు. మండలంలో ఉన్న జనాభా వివరాలు, ఓటర్ల సంఖ్య, ఓటర్ జాబితా, భూములు రిజిస్ట్రేషన్ వివరాలను తహసీల్దార్ జయశ్రీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్ఐ భూక్యశ్రీను పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి.. కేసు నమోదు

హాలియా, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనముల మండలం ముక్కమాల గ్రామ పంచాయతీ కార్యదర్శి తుమ్మలూరి గోవర్ధన్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన గోనే శ్రీనివాసరావు దాడి చేశాడు. శ్రీనివాస్‌రావు అకారణంగా తనతో గొడవ పడి దుర్భషలాడడని గోవర్ధన్‌రెడ్డి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. సాయిప్రశాంత్ తెలిపారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



దేవరకొండలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నాగార్జునసాగర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహింపే ధర్నాను విజయంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సాగర్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింహ్మారెడ్డి, నారాయణరెడ్డి, కేశవరెడ్డి, ఇంద్రారెడ్డి, నారాయణరెడ్డి, సీతా కళ్యాణి, ఈశ్వరయ్య, సాంబశివరావు, బాలాజీ, రవి, నర్సిరెడ్డి ఉన్నారు.

దేవరకొండ: ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన పదవి విరమణ బెనిఫిట్స్ వెంటనే అందజేయాలని దేవరకొండ నియోజకవర్గ రిటైర్డ్ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాటిశెట్టి నర్సింహ, అంకం చంద్రమౌళిలు కోరారు. మంగళవారం దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవనం ఎదుట సమస్యలను పరిష్కరించాలని ఈనెల 7న తలపెట్టిన ఛలో ఇందిరాపార్కు మహాధర్నా కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను విడుదలచేసి మాట్లాడారు. ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, పంగునూరి లింగయ్య, వనం బుచ్చయ్య, పురుషోత్తం, యూసుఫ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై అంచనా వేస్తున్నాం

చింతపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నామని ఏవో శ్రావణకుమారి తెలిపారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని వింజమూర్ పరిధిలో గల రాయినిగూడెంలో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 33 శాతానికి పైగా పంట నష్ట జరిగితేనే పరిగణలోకి తీసుకోనే నష్టహారం అందించేందుకు ప్రణాళిక తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏర్పుల చిన్న నరసింహ, తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాడ్గులపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉచిత పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి జీవీ. రమేష్ కోరారు. మండలంలోని దాచారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో మాట్లాడారు. గ్రామంలో 80పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. పాడి రైతులు తమ పశువులను సరైన సమయంలో టీకాలు వేయిస్తే ఆరోగ్యవంతంగా ఉండి పాడిని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, పశువైద్య సిబ్బంది శ్రీలత, జయమ్మ, రాకేష్, గోపాల మిత్రులు రవి, శోభన్‌రెడ్డి, ఉపేందర్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, రైతులు నాగయ్య, నవీన్, నరేష్, వెంకటరెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో రెవెన్యూ మేళాలు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో రెవెన్యూ మేళాలు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ తెలిపారు. కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పట్టణ పరిధిలోని గృహ, వాణిజ్య భవన యజమానుల ఆస్తులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి మంగళ, గురువారాల్లో రెవెన్యూ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పేరు/ఆస్తుల మార్పిడి, సవరణలు, నూతన ఇంటి నెంబర్ల కేటాయింపు తదితర అంశాలకు సబంధించిన సేవలు మేళాలో అందుబాటులో ఉంటాయన్నారు. ఆస్తి, నల్లా పన్నుల చెల్లింపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట మునిసిపల్ మేనేజర్ జ్ఞానేశ్వరి, డీఈ వెంకన్న, అధికారులు అంజయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

గుర్రంపోడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు కోరారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బిక్షం మహారాజ్ అఖిలపక్ష సమావేశం నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 9 షెడ్యూల్‌లలో చేర్చి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మహేష్, వెంకటయ్య ముదిరాజ్, నర్సింహ యాదవ్, శేఖర్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రోగ నిరోధక శక్తి

మాడ్గులపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకుంటే రోగ నిరోదక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ అన్నారు. మం డలంలోని ఆగామోత్కూర్ జడ్పీహైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. బాలబాలికలకు పోషక విలువల గురించి వాటిని తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. మనం తీసుకునే ఆహారంలో మిల్లెట్స్, చిరుధాన్యాలను, పప్పు దినుసులను, ఆకు కూరలు తీసుకుంటే వ్యాధి నిరోధకశక్తి పెంపొంది ఆరోగ్యవంతులుగా ఉండచవ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, హెచ్ఎం వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు నగేష్, జనార్ధన్, నాగేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, గురవయ్య, ఆనంద్‌కుమార్, హేమలత, షాకీరాబాను తదితరులు పాల్గొన్నారు.

చందంపేట: ఆడ పిల్లల సంరక్షణ సమాజ బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యకుమారి అన్నారు. మంగళవారం చందంపేట మండల కేంద్రంలో బేటిబచావో, బేటిపడావో కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలు సమాజానికి అమ్మలాంటివారని, వారికి సమాన హక్కులు, అవకాశాలు ఇవ్వాలన్నారు. ఆడపిల్లలను అక్రమంగా విక్రయించేవారిపై, బాల్య వివాహలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు.

వేములపల్లి: చిన్నారులు బాల్య వివాహాలు కలిగే అనర్థాల పట్ల తగిన అవగాహన కలిగి ఉండి వాటికి దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమి రజిని అన్నారు. మంగళవారం మండలంలోని రావులపెంట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికల అక్రమ రవాణా, అక్రమ దత్తత, భ్రూణహత్యలు ప్రోత్సహించడం చట్టరిత్యా నేరమని అందుకు తగిన శిక్షను అనుభవించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం అమరేందర్‌రెడ్డి, టీచర్లు శ్రీధర్, కృష్ణయ్య, నిర్మల, వసుంధర, నాగమణి పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమికి ఆలయాలు ముస్తాబు

చింతపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సాయిసన్నిధితో పాటు వెంకటేశ్వరనగర్ శివాలయాలను మంగళవారం ముస్తాబు చేశారు. ఆలయాలను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం చలువ పందిళ్లు వేశారు. వేసి తాగునీటి వసతితో పాటు అల్పాహారం, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయింత్రం కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో ఆలయాల్లో భక్తిభావం సంతరించుకుంది. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని సాయిసన్నిధి కమిటీ చైర్మన్ ధనుంజయ్య తెలిపారు.

7 నుంచి షిర్డీసాయిబాబా మందిరం త్రయోదశ వార్షికోత్సవం

డిండి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షిర్డీసాయి మందిరం త్రయోదశ వార్షికోత్సవాన్ని ఈ నెల 7 నుంచి నిర్వహిస్తున్నట్లు షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షుడు పానగంటి నర్సింహ, కాయితి పర్వత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న నగరసంకీర్తన, కాగడహారతి, అభిషేకం, సంస్థాన హారతి, మంటరాధన ప్రవేశం, గణపతిపూజ, లక్ష్మీగణపతిహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



డిండి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి చేరాలని తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 22 మంది విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను అందజేశారు. యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాధిక కృష్ణ, రిటైర్డ్ ఎంపీడీవో తాటిశెట్టి సుదర్శన్, కదారి శ్రీశైలం, గాయాల రాఘవేందర్, పి. రవి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

దామరచర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు జూబ్లిహిల్స్‌లోని రమావత్ నగర్ డివిజన్ కార్మిక నగర్‌లో గడపగడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని మండల నాయకులు ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి విజయ్, భానుబేగమ్, నగేష్, దస్తగిరి, హబీర్, సాహిల్ తదితరులు ఉన్నారు.

తన్నీరు సత్యనారాయణరావు మృతికి సంతాపం

చింతపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతికి చింతపల్లి మండల నాయకులు సంతాపం తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్రనేత కేతావత్ బిల్యానాయక్ మంగళవారం సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట నేనావత్ జైపాల్‌నాయక్, మోతీలాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.